Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03


నెల్లూరు, 07.12.2018, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 27 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



## గెలిస్తే బాబు ఘనత... ఓడితే కాంగ్రెస్ తలరాత!



- ఎన్నికల ఫలితాల తర్వాత స్క్రిప్ట్ రెడీ
- గెలిస్తే చంద్రబాబు వ్యూహం ఫలించినట్లు
- ఓడితే కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరించినట్లు

*డిసెంబర్ 11వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకల్లా తెలంగాణలో నెగ్గేదెవరో? తగ్గేదెవరో? తేలిపోతుంది. టిఆర్ఎస్ మళ్ళీ గెలిచిందా... అది ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనతే. టిఆర్ఎస్ గెలుపులో క్రెడిట్ భాగస్వాములు ఆయన తప్ప ఎవ్వరూ ఉండరు.*

మరి నాలుగు పార్టీల కలయికకు వేదిక అయిన మహాకూటమి గెలిస్తే... ఆ నిమిషాలలోనే మొదలవుతుంది పచ్చ ఛానల్స్‌లో ప్రచార ప్రభంజనం. 'మహాకూటమి గెలుపు ఘనత చంద్రబాబుదే', 'చక్రం తిప్పిన చంద్రబాబు... చక్రాలు ఊడిపోయిన కేసీఆర్', 'నిన్న కర్నాటక... నేడు తెలంగాణ... రేపు ఢిల్లీ.. అప్రతిహతంగా కొనసాగుతున్న చంద్రబాబు జైత్రయాత్ర'... ఇలాంటి కథనాలు, ట్యాగ్‌లు, హెడ్‌లైన్‌లు.... అబ్బబ్బో ఒకటేమిటి... చంద్రబాబు తలచుకుంటే ఎవరి బ్రతుకైనా తలక్రిందులేనంటూ డప్పుకొట్టి దరువేస్తారు. చంద్రబాబును తెలంగాణలోనూ హీరోను చేస్తారు. కాంగ్రెస్ నాయకులంతా జీరోలైపోతారు. ఈ నాలుగున్నరేళ్ళపాటూ కేసీఆర్ ప్రభుత్వంపై వాళ్ళు చేసిన పోరాటాలన్నీ పక్కకు పోతాయి. ప్రభుత్వ ఏర్పాటులో, ముఖ్యమంత్రి అభ్యర్ధి ఎంపికలో చంద్రబాబు కీరోల్ పోషిస్తాడు. ఎందుకంటే తెలంగాణలోనే మీ పార్టీని అధికారంలోకి తెచ్చినవాడిని, రేపు కేంద్రంలో నిన్ను ప్రధానిని చేయలేనా... అని రాహుల్‌కు ఆఫరిస్తాడు. ఇప్పటికే చంద్రబాబుకు లొంగిపోయిన రాహుల్, ఇంకొంచెం వంగుతాడు. మొత్తంగా తెలంగాణలో మళ్ళీ చంద్రబాబు హవా మొదలవుతుంది.

అలా కాకుండా మహాకూటమి ఓడిపోయిందనుకుందాం... అది కాంగ్రెస్ పార్టీ తలరాత అనుకోవాలి. (మిగతా 10వ పేజీలో)



## గబ్బుపడుతున్న గబ్బర్‌సింగ్

- పక్కా టిడిపి బ్రాండ్
- అభిమానంతో పచ్చి మోసం

నా వెనుక పిచ్చి అభిమానులున్నారు. ఈ అభిమానాన్ని సొమ్ము చేసుకుందామనే ఉద్దేశ్యం తప్పితే, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు ఇంకే రాజకీయ ఆశయాలు కనిపించడం లేదు. అసలు రాజకీయాలలో పోరాటం చేయాలి, ప్రజలవైపు నిలబడాలన్న చిత్తశుద్దే ఆయనలో కనిపించడం లేదు. అవేమీ లేకపోగా, ఈయన చంద్రబాబు మనిషే... అనే విషయాన్ని రోజురోజుకీ బలంగా ఋజువు చేసుకుంటున్నాడు.

2014 ఎన్నికల్లో చంద్రబాబుకు ఉపయోగపడ్డ పవన్‌కళ్యాణ్, ఇప్పుడు ప్రత్యేక జెండాతో తిరుగుతున్నాడు. నాలుగున్నరేళ్ళుగా తాను మద్దతునిచ్చిన తెలుగుదేశం పార్టీయే అధికారంలో వుంది. ఎన్నికలప్పుడు ఇచ్చిన ఏ వాగ్ధానాన్ని సక్రమంగా అమలు చేయ లేదు. ఆరోజు మాత్రం చంద్రబాబు ఇస్తున్న హామీల (మిగతా 10వ పేజీలో)



## నారా వారికి నందమూరి లోకువ!

### చుండ్రు సుహాసిని మరో బలిపశువేనా?

ఇటీవల సోషల్ మీడియాలో ఒక పోస్ట్ అందరినీ ఆకర్షిస్తోంది. "ఎవరైనా పెళ్లి చేస్తే.. అల్లుడికి డబ్బు, బంగారం, భూములు కానుకగా ఇస్తారు, కానీ ఎన్టీఆర్ తన అల్లుడు చంద్రబాబుకు కుటుంబాన్నే కట్నంగా ఇచ్చాడు"... నిజంగానే ఈ పోస్ట్‌లో చాలా అర్ధముంది. నందమూరి ఇంటి అల్లుడు కాకపోతే చంద్రబాబు ఎక్కడ? ఒకవేళ రాజకీయాలలో ఉంటే ఉండొచ్చేమో... ఒక పెద్ద పార్టీ ఆయన గుప్పిట్లో వుంటుందా? 14ఏళ్లు ఏపి సిఎంగా పనిచేసే అవకాశం దక్కుతుందా? కేవలం నందమూరి ఇంటి అల్లుడు కావడమే ఆయనకు కలిసొచ్చింది. ఆ సంగతి తెలిసేనేమో... ఆయన తన కొడుకు లోకేష్‌ను కూడా నందమూరి ఇంటికే అల్లుడిని చేశాడు.

చంద్రబాబును అల్లుడిగా చేసుకోవడం దగ్గర నుండి 1985లో పార్టీలోకి తీసుకోవడం మొదలు 1995లో ఎన్టీఆర్‌ను సీఎం కుర్చీ నుండి దించే వరకు నందమూరి కుటుంబం నారా చంద్రబాబుకు ఎంతో ఉపయోగపడింది. ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుడిని చేయడంలో నందమూరి కుటుంబసభ్యులే సహకరించారు. ఆ తర్వాత కూడా ప్రతి సందర్భంలోనూ నందమూరి కుటుంబాన్ని ఆయన ఎంతగా వాడుకోవాలో అంతగా వాడేసుకుంటున్నాడు. అదే సమయంలో నందమూరి కుటుంబసభ్యులను ఎంతగా తొక్కాలో అంతగా (మిగతా 10వ పేజీలో)



## నెల్లూరు కబుర్లు

# వానా.. వానా... వెల్లువాయే!



వానల కోసం నెల్లూరు జనాలు మొహం వాచిపోయి వున్నారు. వానల కోసం చివరకు తుఫాన్‌లు వచ్చిన ఫర్వాలేదనుకుంటున్నారు. మా జిల్లాకు తుఫాన్‌లు రావాలని బ్యానర్లు కట్టిమరీ ఆహ్వానిస్తున్నారు. మొన్న 'గజ' తుఫాన్ గజగజ వణికిస్తుందనుకుంటే అది దక్షిణ తమిళనాడుకు పారిపోయింది. దాని మూలంగా జిల్లాలో చిన్నపాటి తుప్పర్లు తప్పితే పెద్ద వర్షాలు లేవు. నెల్లూరుజిల్లాలో పడితే నవంబర్‌లోనే వర్షాలు పడాలి. లేకుంటే కష్టమే. నవంబర్ కూడా దాటి డిసెంబర్ మొదటివారంలోకి వచ్చాం. ఇక వర్షాలు వుండవు... ఈ ఏడాది సాగునీళ్లే కాదు, తాగునీళ్ళకు కూడా అగచాట్లు తప్పవను కుంటున్న తరుణంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల 4వ తేదీ నుండి జిల్లాలో వర్షాలు మొదలయ్యాయి. 5వ తేదీ కొంచెం గట్టిగానే వాన పడింది. ఈ ఏడాదికి ఇదే పెద్ద వర్షం. జిల్లా వ్యాప్తంగా ఒకేసారి వర్షాలు పడ్డాయి. ఈ జడి ఓ నాలుగురోజులు కొనసాగితే ముందు తాగునీళ్ళకు ఇబ్బంది లేకుండా పోతుంది. వర్షాల వల్ల నెల్లూరు రోడ్లతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నా, వానలు రావడం ప్రజలకు ఆనందంగానే వుంది.

## సత్ఫలితాలనిస్తున్న చర్యలు

ఈ జిల్లాలో 16 నెలల పాటు పనిచేసిన ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ ఒక ఒరవడిని నెలకొల్పాడు. బెట్టింగ్ రాయుళ్ళు, అక్రమ రవాణాదారులు, స్మగ్లర్లకు ఒక భయం పెట్టాడు. తన శాఖలోని సిబ్బందిని కూడా కంట్రోల్‌లో పెట్టాడు. ఆయన తర్వాత ఎస్పీగా వచ్చిన ఐశ్వర్య రస్తోగి కూడా ఆ ఒరవడిని ఏ మాత్రం తగ్గనీయడం లేదు, సరికదా, పాత ఎస్పీ ఆలోచనలకు మరింత మెరుగుపట్టి అమలు చేస్తు న్నాడు. వచ్చిన ఒకట్రెండు నెలల్లోనే జిల్లాలో పోలీసింగ్ ఎలా వుండాలో చూపిస్తున్నాడు.

ఎప్పుడు ఎక్కడ చూసినా ప్రజలకు పోలీసు కనపడాలి. ప్రజలకే కాదు, నేరాలు చేయాలన్న ఆలోచన వున్న వాళ్ళకు కూడా పోలీస్ కనపడాలి. ఈ నేరాలు చేయాలనుకున్నవాళ్ళకు, నేరస్థులకు పోలీస్ భయం వుండాలి. ఈ ఆలోచనతో ఏర్పాటు చేసిన రక్షక్ బృందాలు, స్పెషల్ పార్టీ పోలీసింగ్ మంచి ఫలితాలనే ఇస్తున్నాయి. ముఖ్యంగా ఈవ్ టీజింగ్‌లు తగ్గాయి. సిటీ రోడ్లపై బైక్ రేస్‌లు, విన్యా సాలు కూడా తగ్గాయి. ఇంతకుముందు కుర్రాళ్ళు రోడ్ల మీద రాకెట్ల మాదిరిగా దూసుకుపోతుండే వాళ్ళు, ఇలాంటి వారివల్ల ఎన్నో ప్రమాదాలు జరి గాయి. నిరంతరం పోలీసుల తనిఖీలతో అలాంటి వారికి కళ్లెం పడింది. పోలీసులు రాత్రి, పగలు గస్తీ కాస్తుండడంతో చైన్ స్నాచింగ్‌లు కూడా అదుపులోకి వచ్చాయి. నెల్లూరులో ట్రాఫిక్‌కు పెద్ద సమస్యగా వున్న ఆటోలపై కూడా ఎస్పీ దృష్టి పెట్టారు. ఒక క్రమపద్ధతిలో ఆటోలను నడిపేలా చర్యలు తీసు కుంటున్నారు. నగరంలో యూటర్న్‌లను బాగానే అమలు చేస్తున్నారు. ముఖ్యంగా ఏఆర్ పోలీసులను ట్రాఫిక్, నేర నియంత్రణ విధులకు వాడుకుంటుం డడం వల్ల ప్రతి క్షణం పబ్లిక్‌లో పోలీసులు కనపడే పరిస్థితి వచ్చింది.

## రాజకీయ వివాదాల మధ్య
# చెరువులో శివలింగం



నెల్లూరులోని స్వర్ణాల చెరువు... వందల ఏళ్ళ చరిత్ర వుంది. హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ కంటే రెండింతలు వుంటుంది. కరెక్ట్‌గా దెవలప్‌చేస్తే ట్యాంక్ బండ్‌ను మించిపోతుంది. వందల ఏళ్ళ చరిత్రవున్న ఈ చెరువు క్రింద ఒకప్పుడు వేల ఎకరాల ఆయకట్టు వుండేది. ఇప్పుడు వందల ఎకరాలు కూడా లేవను కోండి. ఇప్పుడు వ్యవసాయానికంటే కూడా నెల్లూరు నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం, అలాగే టూరిజంగా కూడా ఈ చెరువు ఉపయోగపడుతోంది.

ఇక ఆధ్యాత్మికంగా కూడా ఈ చెరువుకు విశిష్ట స్థానం వుంది. నెల్లూరు గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఈ చెరువు గట్టునే వుంటుంది. అలాగే ఏటా లక్షలాదిమంది భక్తులను దేశ విదేశాల నుండి రప్పించే బారా షహీద్ దర్గా రొట్టెల పండుగ ఈ చెరువు చెంతనే జరుగుతుంది. కాబట్టి అటు హిందువులు గాని, ఇటు ముస్లింలు గాని ఈ చెరువును పవిత్రంగానే చూస్తారు.

చెరువు మధ్య ప్రాచీన కాలం నాటి శివలింగం వుందని, చెరువులో నీళ్ళు తగ్గితే శివలింగం బయటపడేదని, చెరువు నిండినప్పుడు శివలింగం మునిగిపోయేదనే ప్రచారం వుంది.

గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా వున్న స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి చెరువు మధ్యలో శివలింగాన్ని వెలికితీసి అక్కడొక ఆధ్యాత్మిక కేంద్రం ఏర్పాటు చేయాలని భావించారు. అయితే అప్పట్లో అది ఆచరణ రూపం దాల్చలేదు.

ఈమధ్య నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శీనయ్య చెరువు మధ్యలో నుండి శివలింగం, పురాతన వినాయక విగ్రహం బయటకు తీశారు. త్వరలో చెరువు మధ్యలో శివలింగం ప్రతిష్టించి అక్కడకు వంతెన ఏర్పాటు చేయస్తామని కూడా ఆయన ప్రకటించడం జరిగింది. ఆయన ఉద్దేశ్యం నెల్లూరు చెరువు ప్రాంతాన్ని ఒక మంచి ఆకర్షణీయ ప్రాంతంగా రూపుదిద్దడమే! అదేదో మతాల మధ్య వివాదం సృష్టించాలని కాదు. కాని, కొందరు ముస్లిం నాయకులు దీనిని వ్యతిరేకిస్తూ బహిరంగంగా కోటంరెడ్డి శీనయ్య పైనే విమర్శలకు దిగారు. దర్గా పవిత్రతను దెబ్బతీయడానికి శీనయ్య శివలింగాన్ని ప్రతిష్ఠించాలని చూస్తున్నాడంటూ ఆరోపణలు సృష్టించారు. దీంతో ముస్లింల ఓట్లు ఎక్కడపోతాయోనన్న భయంతో తెలుగుదేశం పార్టీ వాళ్ళు శివలింగం విషయంలో 'యూటర్న్' తీసుకున్నారు. ముస్లింల అనుమతితోనే చెరువులో శివలింగం ప్రతిష్ఠిస్తామంటూ నుడా శీనయ్య తాజాగా ప్రకటించాడు. ఈ అంశాన్ని రేపింది శీనయ్య... ముగింపు కూడా ఆయనే ఇచ్చాడు! మరి అంత కష్టపడి చెరువులో నుండి బయటకు తెచ్చిన శివయ్యను, శీనయ్య ఎక్కడ పెడతాడో చూడాలి!

## దువ్వూరుకు డాక్టరేట్

నెల్లూరు జగన్ విద్యాసంస్థల్లో మ్యాథమేటిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న దువ్వూరు రవికుమార్ రెడ్డికి డాక్టరేట్ లభించింది. రాయలసీమ యూనివర్సిటీలో ప్రొఫెసర్ జయరామిరెడ్డి ఆధ్వర్యంలో 'ఎంహెచ్‌డీ ఫ్రీ కనెక్టివ్ ఫ్లో అండ్ మాస్ ట్రాన్స్ ఫర్ త్రూ ఎ పోరస్' అనే అంశంపై పరిశోధన చేసారు. ఈ క్రమంలో రాయలసీమ యూనివర్సిటీ డాక్టరేట్ ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ మధుసూదనరెడ్డి, డైరెక్టర్ మమత, అకడమిక్ డైరెక్టర్ ఆదిశేషారెడ్డి, అధ్యాపకులు రవికుమార్ రెడ్డికి అభినందనలు తెలిపారు.

## తిన్నది కక్కించడం పక్కా!

ఉపాధి నిధులలో ఎవరు ఎంత తిన్నా కక్కించడం పక్కా అని హెచ్చరిస్తున్నాడు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బాపిరెడ్డి. 3వ తేదీ నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్షా సమావేశం పెట్టారు. డిప్యూటేషన్ మీద డ్వామాలో పనిచేసిన పలువురు ఉద్యోగులు ఉపాధి నిధులు మెక్కారు. అక్రమాలకు పాల్పడ్డారు. వాళ్లిప్పుడు తమ సొంత శాఖలలో వున్నారు. సోషల్ ఆడిట్‌లో ఎవరెవరు ఎంత తిన్నారో బయటపడింది. డిఆర్‌డిఏలో పని చేస్తున్న ఉద్యోగులు 58లక్షలు, పంచాయితీరాజ్ శాఖ ఉద్యోగులు 29 లక్షలు, అటవీశాఖ ఉద్యోగులు 5లక్షలు, జిల్లా పంచాయితీరాజ్ ఉద్యోగులు 1.69 లక్షలు కట్టాలి. ఈ మొత్తాలను వాళ్ళు వెంటనే కట్టాలి. లేకుంటే కలెక్టర్ ఆదేశాలతో వారి జీతాల్లో కోతేసి జమ చేయడం జరుగుతుందని బాపిరెడ్డి హెచ్చరించడం జరిగింది.

## సురేంద్రరెడ్డిని సత్కరించిన ముస్లిం యువకులు

బీజేపీ జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డిని 3వ తేదీ నెల్లూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మైనార్టీ మోర్చా నాయకులు సత్కరించారు. మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహబూబ్‌బాషా, తాహిర్ బాషా, అబ్దుల్ షఫీ, అజారుద్దీన్, షబ్బీర్, అబ్దుల్ పాల్గొన్నారు.

## వాకర్ సర్వీసుకు 'పట్టాభి'షేకం



వాకర్స్ అసోసియేషన్ నెల్లూరుజిల్లా డిప్యూటి గవర్నర్‌గా అందించిన సేవలకుగాను పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డిని గోల్డెన్‌స్టార్ అవార్డుతో సత్కరించారు ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ వాళ్ళు. 2వ తేదీ గుంటూరులో వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్ అండ్ అవార్డ్స్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాకర్స్ గవర్నర్ ఎం.రామ కృష్ణారెడ్డి, మాజీఅధ్యక్షులు సీతారామయ్య, రీజినల్ ఛైర్మెన్ శ్యామల శ్రీనివాసులురెడ్డి, ఏరియా కో-ఆర్డినేటర్ యం.వి.సుబ్బారెడ్డి తదితరులు వి.ఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా, వాకర్స్ డిప్యూటి గవర్నర్‌గా పట్టాభి రామిరెడ్డి చేసిన సేవలను ప్రశంసిస్తూ ఈ అవార్డును ప్రదానం చేశారు.

## కార్తీకమాసం ముగిసింది

ఈ నెల 7వ తేదీతో కార్తీకమాసం ముగిసింది. ఈ నెల రోజులపాటు శివాలయాలే కాదు, నివాస గృహాలు కూడా దీపకాంతులతో, పూజలతో కళకళ లాడాయి. దాదాపు అందరి ఇళ్ళల్లోనూ మాంసాహారాలు తగ్గిపోయాయి. మార్కెట్‌లోనూ, హోటల్స్ లోనూ నాన్‌వెజ్ అమ్మకాలు తగ్గాయి. కార్తీకమాసం ముగియడంతో ఇక యధావిధిగా ఈ తరహా వ్యాపారాలు మళ్ళీ పుంజుకోనున్నాయి.

## ఐసిడిఎస్ పి.డి వచ్చారు

స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా సరోజిని 3వ తేదీ తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. రెండు నెలలుగా తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్‌గా పి.ఏ నాగలక్ష్మి ఇన్‌ఛార్జ్ పి.డిగా వ్యవహరిస్తుంది. సరోజిని ఒంగోలు నుండి వచ్చారు.

## లక్ష్మీనాథ్ రాగానే... వేణుగోపాలస్వామి స్థలాలు ఖాళీ చేయించాడు

నెల్లూరులో బడా కోటీశ్వరులలో ఒకరు మూలాపేటలోని శ్రీ వేణుగోపాలస్వామి. నగరంలో స్వామివారికి కోట్లాదిరూపాయల విలువచేసే స్థలా లున్నాయి. గతంలో కొన్ని భూములను అమ్మేయగా మరికొన్ని ఆక్రమణలకు గురైవున్నాయి. కాగా, నగరంలో మినీబైపాస్‌రోడ్డులోని టిడిపి జిల్లా కార్యాలయం ఎదురుగా, అలాగే కెవిఆర్ పెట్రోల్ బంకు సెంటర్‌లో కస్తూరిదేవి విద్యాలయం ఎదు రుగా దేవస్థానంకు చెందిన స్థలాలున్నాయి. మినీ బైపాస్‌లో వున్న స్థలాన్ని కంకర అమ్మకందారులు, అలాగే కస్తూరిదేవి స్కూల్ ఎదురుగా వున్న స్థలాన్ని ప్రైవేట్ బస్సులు నిలపడానికి వాడుకుంటున్నారు. ఈమధ్యే ఆలయ కమిటీకి కొత్త ఛైర్మెన్‌గా మన్నెం లక్ష్మీనాథ్‌రెడ్డి వచ్చాడు. రావడంతోటే ఈ రెండు స్థలాలను ఖాళీ చేయించాడు. తమ దేవస్థానం స్థలాల వరకు హద్దులు వేయించారు. స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి నగరంలో కస్తూరిదేవి స్కూల్ ఎదురుగా వున్న స్థలంలో అష్టలక్ష్మి దేవాలయాన్ని, జిపిఆర్ కళ్యాణ మండపం ఎదురుగా వున్న స్థలంలో కళ్యాణ మండపాలను నిర్మించాలని భావించి అందుకు డిజైన్‌లు కూడా గీయించారు. అయితే అవి కార్య రూపం దాల్చలేదు. ప్రస్తుత కమిటీ దేవస్థానంకు నిరంతర ఆదాయం సమకూరేలా, అలాగే ప్రజలకు ఉపయోగపడే రీతిలో ఈ స్థలాలలో నిర్మాణాలు చేపట్టడంపై లక్ష్మీనాథ్ ఆలోచన చేస్తే బాగుంటుంది.

## బిజెవైఎం నూతన కార్యవర్గం

భారతీయ జనతా యువ మోర్చా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఈనెల 1న ఎన్నుకున్నారు. బీజేవైయం జిల్లా ఉపాధ్యక్షులుగా సిహెచ్. చంద్రశేఖర్, ఎస్ కె రసూల్, రమేష్ రెడ్డి, తలారి విమలాకర్, మస్తానయ్య, పి.గౌరీశంకర్, బీఎం సురేష్, ప్రధాన కార్యదర్శులుగా చింతలపల్లి భరత్, నాగినేని జగన్, జి. ప్రసన్న, కార్యదర్శులుగా టి. సుధీర్‌రెడ్డి, ఎల్.రాజేష్, నూనె హజరత్. వి.రాజశేఖర్, ఒట్టూరు సురేష్, వేళ్ళ పాలెం సంపత్ రెడ్డి, ఎ.శివకుమార్, మారం కృష్ణ, అధికార ప్రతినిధులుగా అరుణ్, ధర్మయ్యలను ఎన్నుకున్నారు. ఉదయగిరి నియోజకవర్గం బీజేవైయం ఇన్ చార్జిగా బి. మహేంద్ర, ఆత్మకూరుకు అల్లంపాటి సాంబశివారెడ్డి, కోవూరుకు ఎస్ అంకిరెడ్డి, గూడూరుకు ప.మనోహర్‌రెడ్డి, వెంకటగిరికి జి.రాజేష్‌లను ఎంపిక చేసినట్లు బీజేవైయం జిల్లా అధ్యక్షులు పోలిచర్ల ఉదయ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు

## చిల్డ్రన్స్ పార్కు రోడ్డులో శ్రీ సాయి మినీ ఫంక్షన్ హాల్

నెల్లూరులోని చిల్డ్రన్స్ పార్క్ రోడ్డులో జన్మ దినోత్సవాలు, నిశ్చితార్థాలు, చిన్నపాటి శుభకార్యాలు జరుపుకునేందుకు ఎంతో అనువుగా నిర్మించిన శ్రీ సాయి మినీ ఫంక్షన్ హాల్‌ను ఈ నెల 10వ తేదీన ప్రారంభిస్తున్నారు. ఆరోజు ఉదయం సత్యనారాయణ స్వామి వ్రతం, సాయంత్రం శ్రీ వెంకటేశ్వరస్వామి కళ్యాణం వంటి శుభవేడుకలతో ఈ శుభవేదిక ప్రారంభం కానుంది.

## కలెక్టర్, జడ్జి మాటామంతి

జిల్లా జడ్జి ఏ.వి.రవీంద్రబాబు 4వ తేదీన నెల్లూరులోని కలెక్టర్‌బంగ్లాలో కలెక్టర్ ముత్యాల రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా జడ్జిగా బాధ్య తలు చేపట్టాక రవీంద్రబాబు కలెక్టర్‌ను కలవడం ఇదే మొదటిసారి. ఈ సందర్భంగా ఇద్దరు కూడా జిల్లాలో సమస్యలు, పరిస్థితులు, పలు విషయాలపై సుదీర్ఘంగా చర్చించుకున్నారు.

## ఆదర్శగ్రామంపై...
# కలెక్టర్‌తో చర్చించిన విపిఆర్



రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 5వతేదీన నెల్లూరులోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ముత్యాలరాజుతో సమావేశమయ్యాడు. తాను సంపద్ ఆదర్శగ్రామయోజన క్రింద దత్తత తీసుకున్న ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. గ్రామంలో కనీస డ్రైనేజీ సౌకర్యం లేదని, గాంధీ ఆశ్రమానికెళ్లే రోడ్డు కూడా సరిగా లేదని, గ్రామంలో స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందడం లేదని, గాంధీ ఆశ్రమంలో పలు వసతులు కల్పించాలని ఆయన కలెక్టర్‌కు వివరించారు. పల్లిపాడులో సురక్షిత మంచినీళ్ల కోసం పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి ఓవర్‌హెడ్ స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటు చేయాలని, మీ పరిధిలో వున్న అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తయారుచేసి మీరు మొదలుపెడితే, మీ పరిధిలో లేని పనులను కేంద్రప్రభుత్వంతో మాట్లాడి మొదలుపెట్టిస్తానని ఆయన కలెక్టర్‌కు చెప్పారు. ఈ విషయంలో మీరు అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి పనులు వేగవంతంగా జరిగేలా చూడాలని ఆయన కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో పల్లిపాడు గ్రామం ఇన్‌ఛార్జ్ ఆఫీసర్ సదా భార్గవి, సిపిఓ మూర్తి కూడా పాల్గొన్నారు.

## కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖలో
# ప్రొ. రామిరెడ్డికి మళ్ళీ అవకాశం



కేంద్ర పర్యావరణ అటవి మంత్రిత్వ శాఖ పారిశ్రామిక అనుమతుల కమిటిలో సభ్యులుగా ఎస్.వి.యూనివర్శిటి రసాయన శాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ వై.వి.రామిరెడ్డిని మళ్ళీ నియమించారు. ఈమేరకు ఆ శాఖ సంయుక్త కార్యదర్శి జిగ్మేగ్స్‌టక్పా ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్ళక్రితం వై.వి.రామిరెడ్డిని ఇదే పదవిలో కేంద్ర మంత్రిత్వ శాఖ నియమించడం జరిగింది. నెల్లూరుజిల్లా వింజమూరు గ్రామానికి చెందిన వై.వి.రామిరెడ్డి విద్యార్థి దశ నుండి కూడా ఏబివిపిలో చురుకుగా ఉండేవారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలలో పలు బాధ్యతలు నిర్వహించారు. గత మూడేళ్ళలో దేశవ్యాప్తంగా పర్యటించి పరిశ్రమల ద్వారా వచ్చే కాలుష్య నియంత్రణపై ఆయన అనేక అధ్యయనాలు చేశారు. కాలుష్య నివారణ కోసం కేంద్రమంత్రిత్వ శాఖకు పలు సూచనలు చేశారు. తనకిచ్చిన బాధ్యతను ఎంతో బాధ్యతగా నిర్వహించినందుకు ఇదే పదవిలో ఆయనను మరోసారి మూడేళ్ళ పాటు నియమిస్తూ కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ నిర్ణయం తీసుకుంది.

## చిన్నారుల వైద్య ప్రపంచంలో..
# మరో 'రెయిన్‌బో' వెలసింది

### చెన్నైలో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌ను ప్రారంభించిన ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు



నెల్లూరుజిల్లాకు చెందిన ఎందరో దిగ్గజాలు వివిధ రంగాలలో సేవలు అందిస్తున్నారు. అలాంటివారిలో ఒకరు డాక్టర్ కంచర్ల రమేష్. నెల్లూరుజిల్లా ఏఎస్‌పేట మండలం చిరమన అనే ఓ చిన్న గ్రామం నుండి ప్రయాణం మొదలు పెట్టిన రమేష్ ఈరోజు చిన్నారుల ఆరోగ్యానికి భరోసా కల్పించేలా, అంతర్జాతీయ ప్రమాణాలతో వైద్యసంస్థలను నెలకొల్పుతూ వైద్యరంగంలోనే తనకంటూ ఓ ఖ్యాతి సాధించుకున్నాడు. అలాంటి రమేష్ సారథ్యంలో చెన్నై నగరంలో చిన్నారుల వైద్యం కోసం మరో రెయిన్‌బో వెల్లివిరిసింది. చెన్నై, గిండి ప్రాంతం, అన్నాసలైలో 120 పడకలతో ప్రసూతి (బర్త్ రైట్) మరియు పిల్లల సంరక్షణకు చెందిన పూర్తి విభాగాలతో ఏర్పాటు చేసిన రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌ను ఈ నెల 2వ తేదీన భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తమిళనాడు గవర్నర్ బన్వర్‌లాల్ పురోహిత్, తమిళనాడు మంత్రులు డి.జయకుమార్, డాక్టర్ సి.విజయభాస్కర్, చెన్నైలోని బ్రిటన్ డిప్యూటి హైకమిషనర్ జెర్మీఫిర్మోర్ బెడ్‌ఫోర్డ్, తమిళనాడు ప్రిన్సిపల్ సెక్రటరి డాక్టర్ జె.రాధాకృష్ణన్ తదితరులు హాజరయ్యారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఈ సందర్భంగా చెన్నై నగరానికి ఇంతటి ఆధునిక వైద్యదేవాలయాన్ని అందించారంటూ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కంచర్ల రమేష్‌ను, డైరెక్టర్ డాక్టర్ దినేష్ చీర్లను అభినందించారు. పిల్లల సంరక్షణ, చికిత్సలపై వైద్యసంస్థలు ప్రత్యేకశ్రద్ధ పెట్టాలని కోరారు. ఆసుపత్రి ఎం.డి డాక్టర్ కంచర్ల రమేష్ తన ప్రసంగంలో కార్యక్రమానికి విచ్చేసి ఆశీర్వదించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. చైల్డ్ స్పెషలిస్ట్‌గా చెన్నైలోనే కేరీర్‌ను మొదలుపెట్టిన తాను, ఈరోజు చెన్నైలోనే ఇంత మంచి ఆసుపత్రిని నిర్మించడం ఆనందం కలిగిస్తుందన్నారు. 1999లో హైదరాబాద్‌లో మొదలైన రెయిన్‌బో చైన్ ఆఫ్ చిల్డ్రన్స్ హాస్పిటల్స్‌ను బెంగుళూరు, విజయవాడ, ఢిల్లీ, చెన్నై నగరాలకు విస్తరించామని, త్వరలోనే విశాఖపట్నంలోను ఆసుపత్రిని ప్రారంభిస్తామని వెల్లడించారు.

దేశ విదేశాల నుండి విచ్చేసిన వివిధ రంగాల ప్రముఖులు, ముఖ్యంగా సొంత జిల్లా నెల్లూరు నుండి విచ్చేసిన ఆప్తులు, ఆత్మీయుల అభినందనలతో ఈ కార్యక్రమం ఎంతో చక్కగా జరిగింది.







■ విఆర్ విద్యాసంస్థల ఓటర్లారా తస్మాత్ జాగ్రత్త!

# దొంగ దొంగ అంటూ గజదొంగ వస్తున్నాడు

కొందరు పూర్వ విద్యార్థుల పోరాట ఫలితంగా నెల్లూరులోని చారిత్రాత్మక విఆర్ విద్యా సంస్థల పాలకవర్గం ఎన్నిక చెల్లదంటూ సుప్రీం కోర్టు తీర్పునివ్వడం, కొత్త పాలకవర్గం ఎంపికకు మార్గం సుగమం కావడం తెలిసిందే! విఆర్ విద్యాసంస్థలను కాపాడుకునే లక్ష్యంతో కొందరు ప్రముఖులు, పూర్వవిద్యార్థులు, విద్యార్థి పోరాటాలలో పాల్గొన్న మేధావులు నడుం కట్టడం అభినందనీయమే! విఆర్ విద్యాసంస్థల ప్రత్యేకాధికారిగా వున్న జాయింట్ కలెక్టర్ వెట్రి సెల్వి ఆధ్వర్యంలో విఆర్ విద్యాసంస్థల పూర్వ విద్యార్థుల ఓట్ల నమోదు ప్రక్రియ వేగం పుంజుకుంది. బీజేపీ, వామపక్ష అనుబంధ సంఘాల నాయకుల నేతృత్వంలో పాలకవర్గం ఎన్నికలలో పోటీ చేయడానికి ప్యానెల్‌లు కూడా ఏర్పడ్డాయి. వీళ్ళే కాకుండా నిన్నటివరకు విఆర్ సంస్థలపై పెత్తనం సాగించిన ఆనం గ్రూపు కూడా తిరిగి విఆర్‌పై తమ ఆధిపత్యం నిలబెట్టుకునేందుకు ఓట్ల నమోదులో చురుకుగా వ్యవహరిస్తోంది.

అయితే జింకల మందలోకి తోడేలు దూరినట్లు విఆర్ విద్యాసంస్థలను కాపాడుకోవడానికి ఉన్నతాశయాలతో నడుం కట్టిన విఆర్ పూర్వవిద్యార్థుల బృందంలోకి తోడేళ్ళ వంటి వాళ్ళు దూరుతున్నారు. వీళ్ళు గత పాలకకమిటి సభ్యులను 'దొంగ దొంగ' అని అరుస్తూ ఓ గజదొంగ మీ ముందుకు వస్తున్నాడు. పూర్వవిద్యార్థుల ముసుగులో పాలకవర్గంలోకి చొరబడాలని ఈ గజదొంగ పన్నాగం పన్నాడు. ఇందుకోసం పూర్వవిద్యార్థులలో పేరు, ప్రతిష్టలు వున్న వ్యక్తులతో జత కట్టాడు. తన స్వార్థం కోసం వారి ఇమేజ్‌ను వాడుకుంటున్నాడు. సొసైటీల పేరుతో ప్రభుత్వం నుండి తీసుకున్న స్థలాలనే అమ్మేసిన ఈ ఘనుడికి విఆర్ విద్యాసంస్థల ఆస్తులను అమ్మేయడం పెద్ద లెక్కకాదు. కాబట్టి పూర్వవిద్యార్థులు జాగ్రత్తపడాలి. విఆర్ విద్యాసంస్థలు భద్రంగా వుండాలంటే ఇలాంటి వారి నీడ పడకుండా చూడాలి! అప్పుడే గత పాలకవర్గంపై పూర్వవిద్యార్థులు చేసిన న్యాయ పోరాటానికి ఫలితం వుంటుంది. అలాకాకుండా గత పాలకవర్గం చేతుల్లో నుండి విడిపించిన విద్యాసంస్థలను ఇలాంటి గజదొంగ చేతుల్లో పెడితే... విఆర్ విద్యాసంస్థల పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లే అవుతుంది. తస్మాత్ జాగ్రత్త!

## 'ప్రభా'తం

# అన్నదాత ఆక్రందన

పార్లమెంటు హాల్‌లో కూర్చుని శాసనాలు చేసే సభ్యులైనా, పిఎంఓ ఆఫీసులో కూర్చుని దేశ పరిపాలన గావించే ప్రధానమంత్రి అయినా, సరిహద్దుల్లో ఏ.కె.47లు పట్టుకుని దేశానికి కాపలా కాసే సైనికులైనా, అంతరిక్షంలోకి ఉపగ్రహాలను పంపే శాస్త్రవేత్తలైనా, ప్రాణాంతక రోగాలకు మందులు కనిపెట్టే సైంటిస్టులైనా, డాక్టర్లయినా, యాక్టర్లయినా, కలెక్టర్లయినా, కాంట్రాక్టర్లయినా... ఆకలైతే వేళకు నాలుగు మెతుకులు కడుపులో వేసుకోవాల్సిందే! ప్రతిఒక్కరి బ్రతుకుకు ఆధారం మెతుకులే! అంటే ఈ లెక్కన ఈ భూమ్మీదే అతిపెద్ద విఐపి రైతు. రాకెట్లను కనిపెట్టకముందు ఈ భూమిపై మానవ మనుగడ సాగింది. కంప్యూటర్లు, సెల్‌ఫోన్‌లు లేకముందు, విమానాలు, రైళ్ళు లేక ముందు, అధునాతన ఆయుధాలు కనిపెట్టకముందు... అసలు మనం చూస్తున్న ఈ ఆధునిక యంత్ర సాంకేతిక పోకడలేవీ లేకముందు కూడా జనజీవనం సాగింది. కాని మానవ జీవితంలో నాగరికత అన్నది మొదలైనప్పటి నుండి ఇప్పటివరకు కూడా రైతు లేనిదే, అతను పండించే ఆహారం లేనిదే మనిషి మనుగడ వుండదు. ఈ ప్రపంచంలో ప్రతిఒక్కరూ రైతుపై ఆధారపడుతున్నవాళ్ళే! అంటే ఈ ప్రపంచానికి నెంబర్‌వన్ ప్రముఖుడు రైతే!

మరి అలాంటి రైతు ప్రస్తుతం ఎలాంటి స్థితిలో వున్నాడు. ఎలాంటి పరిస్థితికి లోనవుతున్నాడు. వ్యవసాయాన్ని పండుగ అనే స్థాయి నుండి దండగ అనుకునే స్థాయికి ఎందుకొచ్చాడు. గ్రామాలలో వ్యవసాయాన్ని వదిలేసి పట్టణాలకు ఎందుకు వలసపోతున్నాడు. అరకు పట్టిన చేతితో కర్ర పట్టి ఎందుకు నైట్‌వాచ్‌మెన్ డ్యూటీ చేస్తున్నాడు. అన్నం పెట్టిన చేత్తోనే అన్నమో రామచంద్రా అని ఎందుకు అడుక్కుంటున్నాడు?

రైతు ఆరు నెలలు కష్టపడి పంట పండిస్తాడు. అప్పులు చేసి పెట్టుబడి పెడతాడు. రెక్కలు ముక్కలు చేసుకుంటాడు. ప్రకృతితో పోరాటం చేస్తాడు. పరిస్థితులతో తలపడతాడు. ఒక్కోసారి కాలానుగుణంగా వర్షాలు రావు, ఒక్కోసారి వరదలు ముంచెత్తవచ్చు... ఈ రెండు సందర్భాలలోనూ చివరగా నష్టపోయేది రైతే! నారు వేసింది మొదలుకొని పైరు చేతికొచ్చేదాకా మధ్యలో రైతు చేసేదంతా యుద్ధమే! ఇంత పోరాటం చేసి పంట చేతికొచ్చిన తర్వాత తీరా చూస్తే గిట్టుబాటు ధరలుండవు. రైతు శ్రమ బూడిదలో పోసిన పన్నీరవుతుంది. అలాగని మార్కెట్‌లో ప్రజలకు రైతు ఉత్పత్తులు చౌకగా వస్తున్నాయా అంటే అదీ వుండదు. ఉదాహరణకు రైతు కిలో టమోటాలను నాలుగు రూపాయలకు అమ్మాడనుకుందాం. మార్కెట్‌లో అదే టమోటా కిలో 20రూపాయలుగా వుంటుంది. విత్తనం నాటి మొలకెత్తి టమోటా కోతకొచ్చేసరికి మూడు నాలుగు నెలలన్నా పడుతుంది. ఇంతకాలం కష్టపడితే రైతుకొచ్చేది కిలోకు నాలుగు రూపాయలనుకుందాం. దానికి పెట్టుబడి 3రూపాయలు తీసేస్తే మిగిలేది రూపాయి. కాని, అదే టమోటాను ఒక్కరోజులో కొన్న దళారికి కిలో మీద 5రూపాయల దాకా ఆదాయముంటుంది. వీటిని మార్కెట్‌లో అమ్ముకునే వ్యాపారికి ఇంకో 5రూపాయల ఆదాయం వుంటుంది. చిల్లర దుకాణాలలోకి వెళ్లేసరికి మరో 5రూపాయలు ఆదాయం ఉంటుంది. అంటే మూడు నాలుగు నెలల్లో పెట్టుబడి పెట్టి, కష్టపడి పంటను తెచ్చిన రైతుకంటే కూడా ఒక్కరోజులో మిగతా స్థాయిలలో వాళ్ళు పొందే ఆదాయం ఎక్కువ. ఇక్కడ ఒక వాస్తవం ఏంటంటే రైతు శ్రమ మీద, రైతు లాభాల త్యాగం మీదే వీళ్లంతా... కాదు కాదు మనమంతా బ్రతుకుతున్నాం. ఇది ఒప్పుకోవాల్సిన సత్యం.

భూమిని నమ్ముకుని బ్రతికే రైతులకు స్వతహాగానే భూదేవంత ఓర్పు వుంటుంది. అయితే ఇటీవల కాలంలో ఆ ఓర్పు కూడా పోతోంది. ఎంతకాలమని ఇలా తమను తాము మోసం చేసుకుంటూ ఇతరుల కోసం బ్రతగ్గలరు. ఎంతకాలమని ఇలా అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకోగలరు. అందుకే ఈ దేశంలో రైతులు సైతం ఉద్యమబాట పడుతున్నారు. తమ హక్కుల కోసం కాదు... రైతాంగ మనుగడ కోసం ఆందోళనలకు దిగుతున్నారు.

మొన్న ఢిల్లీలో రైతు ఆగ్రహం ఎలా వుంటుందో అన్ని రాజకీయ పక్షాలు చవిచూసాయి. కిసాన్ ముక్తి మోర్చా పేరుతో నిర్వహించిన ర్యాలీలో దేశ వ్యాప్తంగా లక్షలాదిమంది రైతులు పాల్గొన్నారు.

రైతులను బాగా ఇబ్బంది పెడుతున్న అంశాలు మద్దతుధరలు, ఋణభారం. ఇవి ప్రభుత్వాల పరంగా రైతుకు చేయాల్సిన ఉపకారం. ఇక ప్రకృతి కరుణిస్తేనే సాగునీళ్ళు, విద్యుత్ వంటివి అందుబాటులో వుంటాయి. 12ఏళ్ల క్రితం ప్రతిపాదించిన స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని, రైతు సమస్యలపై చర్చించేందుకు 21రోజులు పాటు పార్లమెంటు సమావేశాలు జరపాలని ఈ కిసాన్ ర్యాలీలో రైతుల ప్రధాన డిమాండ్లు. 23 రాజకీయ పక్షాలు ఈ ర్యాలీకి మద్దతు తెలిపాయి. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం దీనిని రైతు ర్యాలీగా కాకుండా వామపక్ష, ఇతర పార్టీల ప్రోద్భలంతో జరిగిన ర్యాలీగా భావిస్తోంది. వారి ఆలోచన ప్రకారం రైతుల ర్యాలీ వెనుక రాజకీయ కోణం వుండొచ్చు. కాని, రైతుల సమస్యల వెనుక ఎలాంటి కోణం లేదు. వారి అప్పులు నిజం, ఆత్మహత్యలు నిజం, దగా పడుతున్న వారి బ్రతుకులు నిజం! రైతు బ్రతుకుకు ముందు ప్రభుత్వాలు గ్యారంటీ ఇవ్వాలి. వ్యవసాయం చేసి నష్టపోతే మేమున్నామనే ధైర్యం ఇవ్వాలి. పరిశ్రమలు పెట్టి ఎత్తిపోయిన వాళ్ళకు వేలకోట్లు ఋణాలు మాఫీ చేస్తున్నట్లుగానే వ్యవసాయం చేసి ఫలసాయం రాక, అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతుకు చేయినందించి చేయూతనిచ్చినప్పుడే ఈ దేశానికి వెన్నెముక విరగకుండా గట్టిగా వుంటుంది.

భూమిని నమ్ముకుని బ్రతికే రైతులకు స్వతహాగానే భూదేవంత ఓర్పు వుంటుంది. అయితే ఇటీవల కాలంలో ఆ ఓర్పు కూడా పోతోంది. ఎంతకాలమని ఇలా తమను తాము మోసం చేసుకుంటూ ఇతరుల కోసం బ్రతగ్గలరు. ఎంతకాలమని ఇలా అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకోగలరు. అందుకే ఈ దేశంలో రైతులు సైతం ఉద్యమబాట పడుతున్నారు. తమ హక్కుల కోసం కాదు... రైతాంగ మనుగడ కోసం ఆందోళనలకు దిగుతున్నారు.



## మైలవరపు అష్టావధానం...

# అందరినీ అలరించింది



మైలవరపు మురళీకృష్ణను సన్మానిస్తున్న పద్యసారస్వత పరిషత్ సభ్యులు

వెంకటగిరి జూనియర్ కళాశాల సంస్కృత ఉపాధ్యాయులు, అవధానశేఖర బిరుదాంకితులు మైలవరపు మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఈనెల 2న నెల్లూరులోని ఆదిత్యకళాశాలలో జరిగిన అష్టావధానం అందరినీ అలరించింది. ఆశుకవితా ధారతో, ధారణతో, సమయస్ఫూర్తితో మైలవరపు వారు అష్టావధానాన్ని అద్భుతంగా నిర్వహించి అందరి ప్రశంసలు అందుకున్నారు.

పద్యసారస్వత పరిషత్ నెల్లూరుజిల్లా శాఖ సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పరిషత్ అధ్యక్షులు పోలవరపు లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ సాహిత్యప్రక్రియల్లో అష్టావధానం ఒకటని, ఈ ప్రక్రియను విద్యార్థులకు కూడా పరిచయం చేయాలనే ఉద్దేశ్యంతో ఇక్కడ ఏర్పాటుచేశామని అన్నారు. అష్టావధానంలో పృచ్ఛకులుగా శతావధాని డా. సూరం శ్రీనివాసులు, అగస్త్యరాజు సుబ్బారావు, కోట రాజశేఖర్, తంగిరాల వెంకట నరసింహకుమార్, ఊరుబిండి వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, సూరం చంద్రశేఖర్, వేమారెడ్డి నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంతరం అవధానిని, పృచ్ఛకులను, ఆచార్య ఆదిత్యను పద్యసారస్వత పరిషత్ వారు ఘనంగా సత్కరించారు.

## బాపూజీ ఆశయాలు..

# ప్రపంచానికే ఆదర్శం

భారతావనికే కాక మొత్తం ప్రపంచానికంతటికీ మహాత్మాగాంధీజీ ఆశయాలు ఆదర్శమని, బాపూజీ దేశానికి చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని పినాకిని ఆశ్రమ కమిటీ సభ్యురాలు గూడూరు లక్ష్మి అన్నారు. ఇందుకూరుపేటలోని పల్లిపాడు పినాకిని ఆశ్రమంలో జరుగుతున్న గాంధీజీ అధ్యయన తరగతుల్లో భాగంగా 'గాంధీజీ ఆశ్రమాలు' అనే అంశంపై ఆమె మాట్లాడుతూ, మనదేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో గాంధీజీ ఆశ్రమాలున్నాయని, జాతిపిత మహాత్మాగాంధీజీ ఆశయాలను అవి మరింతగా విశ్వవ్యాప్తం చేస్తున్నాయని కొనియాడారు. పల్లిపాడులోని పినాకిని ఆశ్రమం కూడా గాంధీజీ ఆశయాల బాటలో నడుస్తోందన్నారు. తొలుత ఆశ్రమంలోని గాంధీజీ విగ్రహానికి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు పొణకా కనకమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గణేశం కృష్ణారెడ్డి, ఆశ్రమం మేనేజర్‌తో పాటు, డైట్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్మిక శాఖాధికారిగా గణేష్

నెల్లూరు జిల్లా కార్మిక శాఖాధికారిగా ఆదూరు గణేష్ ను నియమిస్తూ ప్రభుత్వం ఈనెల 1న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కార్యాలయంలో పనిచేస్తున్న శ్రీనివాస్ పదోన్నతిపై కర్నూలు వెళ్ళారు. గత ఆరు నెలలుగా ఖాళీగా వున్న ఈ పోస్టులో గణేష్ బాధ్యతలు చేపట్టారు.




# సిగ్గు విడిచిన మీడియా!

ఆంధ్రప్రదేశ్‌లోని మీడియా చాలా దారుణంగా తయారైంది. పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్థుల చేతుల్లో పత్రికలు, టివి ఛానెల్స్ వుండడంతో ప్రజాస్వామ్య వ్యవస్తే భ్రష్టుపట్టిపోతోంది. ప్రజలకు వాస్తవాలను తెలియనివ్వడం లేదు. ముఖ్యంగా మీడియా సంస్థలన్నీ కూడా కులతత్వంతో పనిచేస్తున్నాయి. అధికార తెలుగుదేశంకు కొమ్ము కాస్తున్నాయి. ప్రభుత్వ అవినీతి, అక్రమాలకు కాపలా కాస్తున్నాయి. విజయ్‌మాల్యా, నీరవ్ మోదీ లాంటి బకాయిదార్లపై ప్రత్యేక కథనాలు ప్రసారం చేశారు. చర్చా వేదికలు పెట్టారు. మరి మన రాష్ట్రానికి చెందిన ఎంపి సుజనా చౌదరి 5,700కోట్లకు బ్యాంకులను మోసం చేస్తే ఈ కుల మీడియా ప్రత్యేక కథనాలు ఇవ్వలేదు. చర్చలూ పెట్టలేదు. ఈ పచ్చమీడియాకు ప్రజలు త్వరలోనే శ్రద్ధాంజలి ఘటిస్తారు.

**షేక్ జహీర్, నెల్లూరు.**

# అయోధ్యపై తొందరేముంది

అయోధ్యలో రామమందిరం నిర్మించాలంటూ మళ్ళీ ఉద్యమాలు మొదలుపెడుతున్నారు. రామమందిరంకు అంత తొందరేమీ లేదు. ముందు ఈ దేశంలో హిందూ సంస్కృతి పరిరక్షణకు పూనుకోవాలి. క్రైస్తవ మతాంతరీకరణలకు కళ్లెం వెయ్యాలి. దళితులు, గిరిజనులను అక్కున చేర్చుకోవాలి. ఘర్ వాపసీని ముమ్మరం చేయాలి. దేవాలయ కమిటీలలో దళితులకు ఛైర్మెన్‌లుగా, సభ్యులుగా స్థానం కల్పించాలి. ప్రముఖ దేవాలయాలలో ప్రత్యేకపూజల్లో దళితులను పాల్గొనేలా చేయాలి. దళితవాడలు, గిరిజన కాలనీలలో దేవాలయాలు, టిటిడి వంటి సంస్థల ద్వారా కళ్యాణ మండపాలు, విద్యాలయాలు నిర్మించాలి. ఒక్క మందిరం కట్టగానే హిందూ సంస్కృతిని ఉద్ధరించినట్లు కాదు. ఇవన్నీ చేయగలిగితేనే హిందూ సంస్కృతి పురోభివృద్ధికి దోహదం చేసినవారమవుతాం.

**సి. రాజీవి, నెల్లూరు.**

# జగన్‌కు ఒక్క ఛాన్స్

అనుభవజ్ఞుడు, రాష్ట్రం విడిపోయిన పరిస్థితులలో ఏదో ఉద్ధరిస్తాడని చెప్పి 2014 ఎన్నికల్లో చంద్రబాబుకు ఓటేశాము. కాని, ఆయనకు వేసిన ఓటు దండగయ్యింది. రాష్ట్ర చరిత్రలోనే ఇంతటి అధ్వాన్న పాలనను ఎప్పుడూ చూడలేదు. వ్యవస్థలన్నింటిని పాడు చేశారు. అవినీతికి లైసెన్స్‌లిచ్చారు. రాష్ట్రాన్ని ఒక కులానికి అడ్డాగా మార్చారు. గతంలో ఏ ముఖ్యమంత్రి పాలనలో కూడా ఇలాంటి పరిస్థితి లేదు. ఈ కుల పిచ్చి ప్రభుత్వాన్ని కూలదోయాలి. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు ఒక ఛాన్స్ ఇచ్చి చూద్దాం. మంచిగా తన తండ్రిలాగే పనిచేస్తే ప్రజాభిమానం నిలుపుకుంటాడు. లేదంటే ఇలాగే పోతాడు.

**కూనపల్లి పరమేశ్వరరావు, చెరుకుపల్లి.**

## జనసేనాధినేతను...
# ఉతికి ఆరేసిన అనిల్



తెలుగుదేశం అధినేత చంద్రబాబును, జనసేన నేత పవన్ కళ్యాణ్‌ను ఉతికి ఆరేయాలంటే వైసిపిలో రాటుదేలిన నాయకులు ఆర్కే రోజా, పి.అనిల్‌కుమార్‌యాదవ్‌లు. జగన్ ఆత్మాహుతి దళం సభ్యుల్లాంటివాళ్ళు. జగన్ మీద తమకున్న విశ్వాసాన్ని ఎప్పటికప్పుడు చాటుకుంటూనే వున్నారు. ముఖ్యంగా అనిల్ పరిస్థితి పూర్తిగా భిన్నం. అనిల్ రాజకీయాలలోకి రాకముందు నుండి కూడా మెగాస్టార్ చిరంజీవి అభిమాని. ఆయన సినిమాలకు చొక్కాలు చించుకునేవాడు. ఒక్కో సినిమాను పదేసిసార్లు చూసేంత అభిమానం. అదే అభిమానం పవన్‌కళ్యాణ్‌పై కూడా వుండేది.

కాని, రాజకీయాలకు వచ్చేసరికి సినీ అభిమానం పక్కన పెట్టాల్సి వచ్చింది. 2009 ఎన్నికలప్పుడు అభిమానించిన హీరో చిరంజీవినే తన నోటితో తిట్టాల్సి వచ్చింది. 2014 ఎన్నికల్లో పవన్ కళ్యాణ్‌ను తిట్టాల్సి వచ్చింది. గత నాలుగేళ్ల కాలంలో పవన్‌పై అనిల్ విమర్శల జోరు పెంచాడు. ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన పవన్ కళ్యాణ్ చంద్రబాబు చెంచాగా మారి ప్రతిపక్ష నేత జగన్‌పై అవాకులు చెవాకులు పేలుతున్నాడు. మొన్న కూడా జగన్‌పై జరిగిన హత్యాయత్నం 'చిన్న కోడికత్తి గుచ్చుకున్నందుకే ఓ అంటూ తెగ గింజుకుంటున్నాడంటూ' పవన్ వ్యంగ్య వ్యాఖ్యలు చేశాడు.

మొన్న కాకినాడలో జరిగిన 'వంచనపై గర్జన' సభలో పవన్ తాటతీసాడు అనిల్. మాటకొస్తే కానిస్టేబుల్ కొడుకును అంటుంటావ్... చిరంజీవి తమ్ముడినని చెప్పుకోలేని నీదీ ఓ బ్రతుకేనా, అసలు చిరంజీవి లేకుంటే నీవెక్కడ అంటూ తూర్పారబట్టాడు. కోడికత్తి అంటూ జగన్‌పై వ్యాఖ్యలు చేస్తున్నావ్, అదే కోడికత్తితో నిన్ను గుచ్చమంటావా... అప్పుడు తెలుస్తుంది నీ శక్తి ఏంటో అంటూ నిలదీశాడు. అనిల్ కాకినాడ ప్రసంగం సోషల్ మీడియాలో విపరీతంగా హల్‌చల్ చేస్తుండడం విశేషం.

## అభ్యర్థుల పేర్లు మారుస్తూ...
# వైసిపితో టీడీపీ మైండ్ గేమ్!




ఆదాలను బలమైన అస్త్రంగా భావిస్తున్న తెలుగుదేశం నాయకత్వం



జిల్లా రాజకీయాలలో ఒక విధమైన మైండ్ గేమ్ నడుస్తోంది. తెలుగుదేశం పార్టీలో ఆదాల ప్రభాకర్‌రెడ్డికి విరాట్ కోహ్లి బిల్డప్ ఇచ్చి వున్నారు. నెల్లూరు లోక్‌సభే కాదు, జిల్లాలో ఏనీ అసెంబ్లీ... ఆదాల పోటీ చేస్తే గెలుస్తాడు అన్నంత ప్రచారం తెచ్చారు. ఆయన పేరును నెల్లూరు పార్లమెంటుకే కాదు, జిల్లాలో వున్న మిగతా అసెంబ్లీలకు కూడా తిప్పుతున్నారు. జిల్లాలో గూడూరు, సూళ్ళూరుపేట... ఈ రెండు రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు కాబట్టి సరిపోయింది గాని లేకుంటే ఆ రెండు చోట్ల కూడా ఆదాల ప్రభాకర్‌రెడ్డి పోటీ చేయాలనుకుంటున్నాడని చెప్పేవాళ్ళు. నెల్లూరురూరల్, కావలి, కోవూరు అసెంబ్లీలో ఆల్‌రెడీ ఆయన అభ్యర్థిత్వంపై ప్రచారం జరుగుతోంది. ఆత్మకూరుకు ఎలాగూ ఇన్‌ఛార్జ్‌గా వున్నాడు. మొన్నటివరకు నెల్లూరు పార్లమెంట్‌కు వినిపిస్తున్న పేరు ఇప్పుడు అసెంబ్లీకి మారింది. కోవూరునుండని కొందరు, కావలి నుండి పోటీ చేస్తాడని ఇంకొందరు... ఆలూ లేదు... చూలూ లేదు... కొడుకు పేరు సోమలింగం అన్నట్లుగా మాట్లాడుకుంటున్నారు.

టిడిపిలో ఈయనలాగానే వైసిపిలోనూ ఒక బ్రాండ్ అంబాసిడర్ వున్నాడు. ఆయనే మాజీఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి. తెలుగుదేశంలో ఎక్కడ పోటీ చేసినా గెలుస్తాడని ఆదాలకు పేరుంటే, ఈయనకు మాత్రం నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి మళ్ళీ ఆయనే అయితే పక్కాగా ఓడిపోతాడనే బ్రాండ్ పడింది. అదేం దరిద్రమోగాని ఈయన కుంభకోణాలు చేసింది లేదు, ఎవర్నీ తిట్టింది లేదు, ప్రభుత్వ నిధులను దిగమింగిందీ లేదు... కాని పేరు మాత్రం అలా వచ్చేసింది. బహుశా ఆయన మెట్ట ప్రాంతం వాడు కావడం, ప్రజలతో కలుపుగోలుగా లేకపోవడం దీనికి కారణం కావచ్చు. ఆయనపై టిడిపి వాళ్ళు ఓడిపోతాడని ప్రచారం చేస్తే సరే... వైసిపి వాళ్లే ఆ మాటంటున్నారు. నెల్లూరు జిల్లా వ్యాప్తంగా కూడా పార్లమెంటు పోటీ విషయం చర్చకు వచ్చినప్పుడు ఈసారి వైసిపి ఎంపి అభ్యర్థి మేకపాటే అయితే ఓడిపోతాడు అనే మాట కామన్‌గా వినిపిస్తోంది.

ఆదాలకు సరైన అభ్యర్థిగా మేకపాటి సరిపోడని చెప్పే ఇక్కడ ప్రత్యామ్నాయ అభ్యర్థి గురించి వైసిపి అధిష్టానం ఆలోచన చేస్తోంది. కాని, వైసిపిని ఆ వైపు నుండి దృష్టి మళ్ళించేందుకు తెలుగుదేశం కొత్త ఎత్తుగడలు వేస్తోంది. వాళ్ళకు నెల్లూరు ఎంపిగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి వుండాలి. ఆయనపై ఆదాల పోటీ చేయాలి. అప్పుడు పార్లమెంటుకే కాదు, పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీలలో సైతం టిడిపి బలం పుంజుకుంటుంది. అందుకు ముందు చేయాల్సింది... ఆదాలను పార్లమెంటు అభ్యర్థిగా కాకుండా అసెంబ్లీకి పోటీ చేస్తాడని ప్రచారం చెయ్యడం. బి.సి.ల కోటా నుండి బీద మస్తాన్‌రావు పార్లమెంటుకు పోటీ చేస్తాడని ప్రచారం చెయ్యడం. అప్పుడు మేకపాటి రాజమోహన్‌రెడ్డి సరిపోతాడనే అభిప్రాయం వైసిపిలోనూ ఏర్పడుతుంది. మేకపాటి కూడా సిద్ధమైపోతాడు. ప్రత్యామ్నాయ అభ్యర్థి అలోచననే పూర్తిగా పక్కనపెడతారు. కాని చివర్లో చంద్రబాబు సీట్లను నిర్ణయిస్తాడు. నెల్లూరు పార్లమెంట్ నుండి ఆదాలనే పోటీ చేయమంటాడు. ఆయన సరేనంటాడు. తెలుగుదేశం ఎత్తుగడ ఇక్కడ ఫలిస్తుంది. ఆ టైంలో మేకపాటిని పోటీ నుండి తప్పించలేరు. అప్పటికప్పుడు ఆదాలకు ధీటైన అభ్యర్థిని తేలేరు. ఆదాల పార్లమెంట్‌కు పోవాలన్నది చంద్రబాబు నిర్ణయం. ఈలోపు ఆదాల అసెంబ్లీకి అని జరుగుతున్న ప్రచారమంతా కూడా తెలుగుదేశం ఎత్తుగడలో భాగమేమో అన్నది రాజకీయ మేధావుల అభిప్రాయం.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# తండ్రి టిడిపి.. తనయుడు వైసిపి

## • జగన్ బాట పట్టిన వేనాటి సుమంత్‌రెడ్డి




తెలుగుదేశం పార్టీలో టాప్ మోస్ట్ సీనియర్‌లలో వేనాటి రామ చంద్రారెడ్డి ఒకడు. చంద్రబాబుది 1985బ్యాచ్. కాని, రామచంద్రా రెడ్డిది 1983 బ్యాచ్. ఇప్పుడు పార్టీ నాయకులలో ఈ బ్యాచ్ వాళ్ళు చాలా కొద్దిమంది మాత్రమే వుంటారు. అంటే పార్టీలో 35ఏళ్ళ సీనియార్టీ వుంది. మధ్యలో ఒక్కసారి కూడా పార్టీని వదిలి పోలేదు. స్వర్గీయ వై.యస్. రాజశేఖరరెడ్డితో వ్యక్తిగత సాన్నిహిత్యం వున్న రోజుల్లో కూడా ఆయన తెలుగుదేశాన్ని వదల్లేదు.

దాదాపు 35ఏళ్ళ సీనియార్టీకి ఆయనకు లభించిన పదవులు సూళ్ళూరుపేట మండలాధ్యక్షుడు, చెంగాళమ్మ దేవస్థానం ట్రస్ట్‌బోర్డు ఛైర్మెన్, సూళ్లూరుపేట జడ్పీటీసీ, జడ్పీ ఫ్లోర్ లీడరే! సూళ్ళూరుపేట అసెంబ్లీ ఎస్సీ రిజర్వ్‌డ్ కావడంతో ఆయనకు ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించే బాధ్యత పైనపడిందే గాని, ఎమ్మెల్యే అయ్యే అవకాశమే రాలేదు. మొన్నటిదాకా ఏ పదవీ లేకపోయినా కనీసం పార్టీలో విలువవుండింది. 2014 ఎన్నికల తర్వాత పార్టీలో ప్రాధాన్యత తగ్గిపోయింది. ముఖ్యంగా కాంగ్రెస్‌లో వున్న వాకాటి నారాయణరెడ్డి టిడిపిలోకి రావడం, సూళ్లూరుపేట రాజకీయాలలో గంగాప్రసాద్‌కు పెద్ద పీట వేయడం వంటివి రామచంద్రారెడ్డిని చిన్నబుచ్చాయి. జడ్పీ ఛైర్మెన్ కావాలన్న కలలు నెరవేరకపోయినా, కనీసం చంద్రబాబు హయాంలో టిటిడి సభ్యుడిగానో, లేదా ఏదో ఒక నామినేటెడ్ పదవో ఇస్తారని ఆయన ఆశిస్తూ వచ్చాడు. కాని, అవేమీ రాలేదు. రామచంద్రారెడ్డి సీనియార్టీని చంద్రబాబు గౌరవించలేదు. అయినా ఇంతకాలం వున్న తెలుగుదేశాన్ని వీడలేక ఆయన టిడిపిలోనే ఉండిపోయాడు.

కాని, కొడుకులు అలా సర్దుకోరుగా! యువరక్తం వూరికే వుంటుందా? ఇప్పుడు అదే జరిగింది. రామచంద్రారెడ్డి కొడుకు వేనాటి సుమంత్‌రెడ్డి వైసిపిలో చేరిపోయాడు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో జరిగిన జగన్ పాదయాత్రలో పాల్గొని అప్పుడే పరోక్ష సంకేతాలిచ్చిన సుమంత్, ఇప్పుడు జగన్ సమక్షంలో వైసిపి బాట పట్టాడు. ఇప్పుడు తనయుడు వైసిపి... అయినా తండ్రి టిడిపిని వదిలే ఆలోచనలో లేడు.




# వైకాపాలో డిఆర్‌కు పెద్దపీటేసారు!

## • కేంద్ర కార్యనిర్వాహక మండలి సభ్యుడిగా నియామకం



నెల్లూరులో హోటల్ డిఆర్ ఉత్తమ అధినేతగా అందరికీ సుపరిచితుడు, వ్యాపారవేత్త కొడవలూరు ధనుంజయరెడ్డిని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అనుబంధ కీలక విభాగమైన కేంద్ర కార్యనిర్వాహక మండలి (సిఇసి) సభ్యుడిగా నియమించారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. కోట గ్రామానికి చెందిన కొడవలూరు ధనుంజయరెడ్డి 1981 నుండికూడా కాంగ్రెస్‌పార్టీలో వున్నాడు. స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డికి ముఖ్య అనుచరుడిగా ముద్రపడ్డాడు. కోట మండలం రాజకీయాలలో క్రియాశీలకంగా వ్యవహరించేవారు. మూడేళ్ళ పాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా కూడా పని చేశారు. 2015లో ఆనం సోదరులతో పాటే తెలుగుదేశం పార్టీలో చేరిన ఆయన, ఇటీవల ఆనం రామనారాయణరెడ్డి కంటే ముందే వైసిపిలో చేరాడు. కోట మండలంలో విస్తృతంగా తిరుగుతూ వైసిపి పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నాడు. ఆర్టీసీలో కార్మిక సంఘాలకు గౌరవాధ్యక్షుడిగా వున్న ఆయనకు కార్మికుల్లో ప్రత్యేక పట్టు వుంది. ఏ బాధ్యత అప్పగించినా గట్టిగా పనిచేస్తాడనే పేరుండడంతో ఆయనకు వైసిపిలో కీలక పదవి అప్పగించారు.

# బాలికలకు బడిబాట.. దేశ భవితకు బంగారుబాట

కస్తూరిదేవి విద్యాలయం ఇప్పుడు బాగా విస్తరించింది కానీ, ప్రారంభకాలంలో విద్యాలయ స్థాపనకు విద్యాలయం నిర్వాహకులు పడిన కష్టాలు అన్నిన్ని కావు. బాలికలకు చదువెందుకనే ఆ రోజుల్లో బాలికలకు బడి పెట్టినా ఎవరూ పెద్దగా ఆసక్తి చూపేవారు కాదు. అటు స్వాతంత్ర్య సమరంలోనూ, ఇటు సమాజ సేవలోనూ ఉంటూ సమాజాభ్యున్నతే ధ్యేయంగా నిలిచిన కొందరు మహనీయులు పట్టుబట్టి మరీ స్త్రీ విద్యకోసం తపించారు. ఒక్క బాలిక చదువుకుంటే వివాహమయ్యాక ఆ స్త్రీ కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతుంది. తద్వారా సమాజానికీ ప్రయోజనం కలుగుతుంది..మొత్తంగా దేశానికి పురోగతి వస్తుందనే దృఢసంకల్పం వారిది. బాలికలు బాగా చదువుకుంటే వారి భవిష్యత్తుకే కాక, సమాజ భవితకు కూడా మార్గం ఏర్పడినట్లవుతుందని తెలిసిన సమాజసంఘసంస్కర్తలైన ఆ మహనీయులు ఎన్నో అవస్థలు పడి.. ఏర్పరచిన మార్గమిది. పేద బాలికల చదువుకు నాటి మహానుభావులు చూపిన ఆ బడిబాటే నేడెందరో బాలికలకు బంగారుబాటగా మారింది.

## • కష్టాల సుడిలోనే ఆరంభమైన కస్తూరిదేవి విద్యాలయం




కస్తూరిదేవి విద్యాలయం ప్రారంభం నుంచి అన్నీ కష్టాలే. ఒక్క మాటలో చెప్పాలంటే ఆ కష్టాల సుడిలోంచే పాఠశాల ఆవిర్భవించింది. ఎన్నెన్నో ఒడిదుడుకులతో ఈ సంస్థ ప్రారంభమైనా, విద్యాలయం నెలకొల్పాలనుకుని స్థిర నిర్ణయంతో పాటుపడుతున్న వారు స్వాతంత్ర్యసమరంలో జైలుపాలైనా వారు అకుంఠిత దీక్షతో విద్యాలయం ఏర్పాటుకు చేసిన కృషి ఏనాటికీ మరువలేనిది. ఎప్పటికప్పుడు సమస్యలన్నిటినీ అధిగమిస్తూ ధీరోదాత్తంగా వారు ముందుకు సాగేవారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ప్రయత్నాలు సాగిస్తూనే ఉండేవారు. అలా అందరూ కలిసి నిరంతర కృషి సాగిస్తున్న తరుణంలో.. మధ్యలో ఒక దురదృష్టకర ఘటన వారికి ఎంతో బాధ కలిగించింది. విద్యాలయం ఏర్పాటు చేయాలనుకున్న తొలినాళ్ళ నుంచి ఈ కమిటీలో కీలకపాత్ర పోషిస్తూ అప్పట్లో ఈ విద్యాలయం అభివృద్ధికి ఎంతగానో కృషిచేస్తున్న మహనీయుడు శ్రీ రాళ్ళపల్లి రామసుబ్బయ్యగారు పరమపదించడం. ఆయన ఆకస్మిక మరణం అందరినీ ఆవేదనకు గురిచేసింది. 1931 జూన్ 23వ తేది ఉదయం జరిగిన కమిటీ సమావేశంలో శ్రీమతి పొణకా కనకమ్మగారు, శ్రీయుతులు బెజవాడ గోపాలరెడ్డి గారు, రేబాల పట్టాభిరామిరెడ్డి గారు, కె.వి రాఘవాచార్యులు గారు పాల్గొని రాళ్ళపల్లివారి మరణానికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఇలా అన్నిరకాల వేదనలు, కష్టాల ముళ్ళనూ.. కన్నీటి వాగుల్ని దాటుకుంటూ.. ఈ విద్యాలయం అభివృద్ధిపథం వైపు ముందుకు సాగిందంటే నాటి మహనీయుల చిత్తశుద్ధి... కర్తవ్యనిర్వహణలోని దీక్షాదక్షతలే కారణం.

> అన్నిరకాల వేదనలు, కష్టాల ముళ్ళనూ.. కన్నీటి వాగుల్ని దాటుకుంటూ.. ఈ విద్యాలయం అభివృద్ధిపథం వైపు ముందుకు సాగిందంటే నాటి మహనీయుల చిత్తశుద్ధి... కర్తవ్య నిర్వహణలోని దీక్షాదక్షతలే కారణమని చెప్పక తప్పదు.

## 1951లో మొల్లమాంబ గ్రంథాలయానికి శిలాఫలకం

నాటి స్వాతంత్ర్యయోధులకు చదువు పట్ల ఎంతో ఆసక్తి ఉండేదన్నది అందరికీ విదితమే. బాలికలు జాతీయభావాలతో రాణించాలంటే మంచి పుస్తకాలు వారికి అందుబాటులో ఉండాలి. అటు పాఠ్య పుస్తకాలతో పాటు ఇతరత్రా గ్రంథాలు కూడా వారికి చేరువ చేసి వారిలో సమాజం పట్ల, దేశం పట్ల మంచి అవగాహన కలిగించాలి. ఈ సంకల్పంతో కస్తూరిదేవి విద్యాలయంలో ఒక చక్కటి గ్రంథాలయం కూడా రూపుదిద్దాలని నిర్ణయించుకున్నారు.

సమాజంలో స్త్రీలు చదువుకోవడం దండగనే అభిప్రాయాలు జోరుగా ఉండే ఆ రోజుల్లో ఇక అక్షరజ్ఞానం లేకుండా చదువెలా సాగుతుంది?.. స్త్రీలకు చదువన్నా, ఇతర గ్రంథాలు చదువుకోవాలన్నా వారికి ఎక్కడా ఎలాంటి అవకాశాలు ఉండేవి కావు. అయితే ఈ కాలంలోనే కాదు.. అంతకుముందు నాటి కాలంలో స్త్రీల పరిస్థితి మరింత ఘోరంగా ఉండేది. ఆడవారికి, బాలికలకు నాటి సమాజంలో అన్నీ ప్రతిబంధకాలే. అయినప్పటికీ ఆ దుస్థితులన్నిటినీ ధీరోదాత్తంగా అధిగమించి చదువుకోవడమే కాకుండా.. అత్యద్భుతమైన కవితా ప్రతిభతో రాణించి..రామాయణాన్ని సరళసుందరమైన భాషలో రచించి రామాయణ రచయిత్రిగా లోకవిఖ్యాతి పొందిన మహాకవయిత్రి మొల్లమ్మ అందరికీ ఆదర్శం. అందుకే, ఆ మహనీయురాలిని స్మరించుకుంటూ.. ఎంతో విజ్ఞతతో నాటి పెద్దలు కస్తూరిదేవి విద్యాలయంలోని గ్రంథాలయానికి 'మొల్లమాంబ గ్రంథాలయం' అని నామకరణం చేసి ఆ మేరకు 1951 జనవరి 5వ తేదిన అప్పటి మద్రాసు గవర్నర్ భావ్‌నగర్ మహారాజా దంపతులను ఆహ్వానిస్తే.. వారు అందుకు సంతోషంగా అంగీకరించి నెల్లూరుకు విచ్చేశారు. మహాత్మాగాంధీజీ ఆశీస్సులతో మాతా కస్తూరిదేవి పేరుతో ప్రారంభమైన ఈ విద్యాలయం పురోభివృద్ధికి ప్రభుత్వం తరపున తాము సహకరిస్తామని వారు ఆ సందర్భంలో మాటిచ్చారు.

> సమాజంలో స్త్రీలు చదువుకోవడం దండగనే అభిప్రాయాలు జోరుగా ఉండే ఆ రోజుల్లో ఇక అక్షరజ్ఞానం లేకుండా చదువెలా సాగుతుంది?.. స్త్రీలకు చదువన్నా, ఇతర గ్రంథాలు చదువుకోవాలన్నా అప్పట్లో వారికి ఎలాంటి అవకాశాలు ఉండేవి కావు.

ఆ గ్రంథాలయ నిర్మాణానికి నాటి మద్రాసు గవర్నర్ మహారాజ భావ్‌నగర్, మహారాణి భావ్‌నగర్‌ల చేతుల మీదుగా శంకుస్థాపన చేయించడం ఎంత గొప్ప విశేషమో!.. ఈ గ్రంథాలయం ప్రారంభించే నాటికి కస్తూరిదేవి విద్యాలయంలో చదువుకుంటున్న బాలికల సంఖ్య నాలుగువందలకు చేరిందంటే చూడండి.. ఎంత గొప్ప సామాజికమైన మార్పో!.. కృషి ఉంటే మనుషులు రుషులవుతారన్నట్లుగా ఆ మహానుభావుల సంకల్పబలం సింహపురి సీమలోని బాలికల జీవితాలకు బంగారుబాటలు వేసిందంటే ఎంతమాత్రమూ అతిశయోక్తి లేదు.

నాటి మహనీయులు సమాజసేవా దృక్పథంతో చేసిన ఆ బృహత్తర కార్యాలన్నీ వారికే కాదు.. సింహపురీయులందరికీ గర్వకారణమైన విషయాలు. ఇవన్నీ కస్తూరిదేవి విద్యాలయానికి సంబంధించిన పూర్వకథలోని..అపూర్వ విషయాలేనని వేరే చెప్పనక్కర లేదు.

## వదాన్యుల చేతిచలువతోనే విద్యాలయం నిర్వహణ!

ఆ రోజుల్లో బడి పెట్టడమంటే మాటలు కాదు. విద్యాలయం నిర్వహణ ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. అయినా, సింహపురి వదాన్యుల సహకారం, వారి చేతిచలువతో విద్యాలయం అన్ని కష్టాలను అధిగమిస్తూ వస్తోంది. మరోవైపు ప్రజల ఆశీస్సులు విద్యాలయ కార్యకర్తలను మరింత ఉత్సాహంతో ముందుకు నడిపించాయి. ఇదిలా వుంటే, ఆడపిల్లలకు చదువు ఎందుకనుకునే నిరాశలో ఉన్న పేదకుటుంబాల వద్దకు వెళ్ళి వారి పిల్లలను బడిలో చేర్పించేందుకు వారి తల్లిదండ్రులకు, కుటుంబసభ్యులకు తమ పిల్లల చదువు పట్ల అవగాహన కల్పించడం మరో పెద్ద కార్యక్రమమైంది. ఆ కర్తవ్యాన్ని కూడా వారే ఎంతో దీక్షతో బాధ్యతతో నిర్వహించడం విశేషం!

> బాలికలు క్రమేణా బడికి బాగా వస్తున్నారనేది సంతోషమైతే, బాలికల సంఖ్య పెరిగేకొద్దీ నిర్వహణ కూడా మరింత వ్యయభారమైంది. 1944-45లో 2,729 రూపాయలున్న లోటు, 1948-49 నాటికి 16,785 రూపాయలకు చేరుకుంది.

కృషితో నాస్తి దుర్భిక్షమ్.. అన్నట్లుగా చివరికి వారి కల సాకారమైంది. బాలికల చదువుకు పాఠశాల ఏర్పాటు చేయాలనే సంకల్పం నెరవేరింది. తొలుత బడికి వచ్చేందుకు బాలికలకు ఆసక్తి లేకపోయినా, ఆ మహనీయుల నిస్వార్థ కృషి ఫలితంగా 1944 జులై 16వతేదీన 'శ్రీ కస్తూరి దేవి బాలికల హైస్కూల్' ప్రారంభమైంది. ఒకరిద్దరి బాలికల రాకతో ప్రారంభమైన ఆ బడిలో 1945 నాటికి విద్యార్థినుల సంఖ్య 47కు చేరింది. అప్పట్లో ఇదో పెద్ద సంచలనం. 1945-46వ సంవత్సరం వచ్చే సరికి ఆ సంఖ్య 106కు పెరిగింది. అదేవిధంగా, 1946-47లో 253 మంది, 1948-49లో 276 మంది విద్యార్థినులు ఈ హైస్కూల్లో చేరి విద్యను అభ్యసించారు. ఒకవైపు ఆనందం.. మరోవైపు ఆర్థికంగా కష్టం. బాలికలు బడికి బాగా వస్తున్నారనేది సంతోషమైతే, బాలికల సంఖ్య పెరిగే కొద్దీ నిర్వహణ కూడా మరింత వ్యయభారమైంది. 1944-45లో 2,729 రూపాయలున్న లోటు, 1948-49 నాటికి 16,785 రూపాయలకు చేరుకుంది. ఈ మొత్తం అప్పట్లో చిన్నదేమీ కాదు. ఇప్పటితో పోల్చుకుంటే లక్షల్లోనే ఉంటుంది. అయినా, ఏమాత్రం తొణక్కుండా బెణక్కుండా ఆ మహానుభావులందరూ అవిశ్రాంత కృషి చేయడం వల్లే ఈ విద్యాలయం పునాదులు అంత గట్టిగా ఉండి నేటి అభివృద్ధికి బంగరుబాటలు వేశాయన్నది గమనించాల్సిన విషయం.

ఇలా ఎంతోమంది ప్రజల సహాయసహకారాలతో, వదాన్యుల ఔదార్యంతో.. కొంత ప్రభుత్వ గ్రాంట్‌తో అప్పట్లో ఈ విద్యాలయం నడిచేది.

## కస్తూరిదేవి బాలికల కోసం హాస్టల్ కూడా ప్రారంభం

పాఠశాలలో విద్యార్థినుల సంఖ్య పెరగడంతో, బాలికలను వారి ఇళ్ళ వద్దనుంచి క్రమం తప్పకుండా వేళకు వారిని బడికి తీసుకువచ్చేందుకు ఈ పాఠశాలకు అప్పట్లోనే ప్రత్యేకించి ఒక మోటార్ వ్యాను కూడా ఉండేదంటే బాలికల విద్య పట్ల ఆ సంఘసేవకులు ఎంతగా శ్రద్ధ చూపేవారో తేటతెల్లమవుతుంది. అప్పట్లోనే 40వేల రూపాయలు వెచ్చించి ఈ పాఠశాలకు అనుబంధంగా వసతి గృహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో విశేషం. దీంతో 'కస్తూరిదేవి బాలికల హాస్టల్'లో విద్యార్థినుల సంఖ్య కూడా క్రమేణా పెరుగుతూ వచ్చింది. స్త్రీవిద్యాభ్యున్నతికి ఈ వసతులన్నీ రాచబాటలయ్యాయి. తొలుత 12 మంది మాత్రమే ఉన్న ఈ హాస్టల్లో 1944 నాటికే ఆ సంఖ్య 40కి దాటడం ఆ కాలంలో ఎంతైనా ఆశ్చర్యకరమే మరి!.. ముఖ్యంగా నిరుపేద దళితులు, అభాగ్యులైన బాలికలతో పాటు స్థానిక కళాశాలల్లో చదువుకుంటున్న పేద బాలికలు కూడా ఈ వసతిగృహంలో ఉండి చదువుకునేందుకు వీలు కల్పించారు. బాలికలందరికీ ఉచితంగా భోజనం, వసతి సౌకర్యాలు బాగా ఉండేవి. ఆ తర్వాత, 1948లో విద్యాబోధనలో మరింత ముందుకు సాగుతూ, ప్రధానంగా హోం సైన్స్ సబ్జెక్ట్‌తో పాటు, చిత్రలేఖనం, పెయింటింగ్‌లలో కూడా విద్యార్థినులకు శిక్షణ ఇచ్చేవారు. అందుకోసం ప్రత్యేకంగా ఒక ఆర్ట్ గ్యాలరీ కూడా ఏర్పాటు చేశారు.

> స్వాతంత్ర్య సమరయోధురాలు.. ఈ విద్యాలయం స్థాపకురాలైన పొణకా కనకమ్మతో పాటు తిక్కవరపు రామిరెడ్డి వంటి వదాన్యులు.. వీరందరి ప్రేరణతో ఈ విద్యాలయానికి గ్రంథాలయం ఏర్పాటుకు కూడా సంకల్పించారు.

ఈ పాఠశాలకు ఒక గదిలో ఓ పుస్తకాల గది అన్నట్లుగా గ్రంథాలయం ఉండేది. దానిని కూడా బాగా విస్తరింపజేసి బాలికలకు మరింతగా చదువుపట్ల ఉత్సాహం కల్పించాలని స్వాతంత్ర్యసమరయోధురాలు.. ఈ విద్యాలయం స్థాపకురాలైన పొణకా కనకమ్మతో పాటు తిక్కవరపు రామిరెడ్డి వంటి వదాన్యులు.. వీరందరి ప్రేరణతో ఈ విద్యాలయానికి గ్రంథాలయం ఏర్పాటుకు కూడా సంకల్పించారు.

(మిగతా కథ వచ్చే వారం)

### సంస్కారహీనమైన, అనాగరికమైన, ఆటవికమైన, అసహ్యకరమైన వంటి పదజాలాలతో...

# ఛీ... ఛీ ఇవేం రాతలు... ఇదేం జర్నలిజం...?

అయ్యా పాతపేపరు సంపాదకా... నీ పత్రికకు 80 సంవత్సరాల చరిత్ర వుందని, మీ తాతలు నేతులు తాగారని చెప్పుకుంటూ మూతులు తుడుచుకుంటున్న నువ్వు, ఈ పత్రిక నీ చేతుల్లోకి వచ్చాక ఎంత దిగజారిపోయిందో ఒక్కసారి ఊహించుకో. నీచాతినీచమైన పదజాలంతో నీవు చేసే జర్నలిజం, వ్యక్తులపై ఘోరంగా విమర్శలు చేసే నీ శాడిజం చూసి యావత్ పత్రికా రంగమే సిగ్గుతో తలదించుకుంటోంది. ఘనకీర్తి కలిగిన నెల్లూరుజిల్లా స్థానిక చిన్న పత్రికల చరిత్రకే మచ్చ ఏర్పడింది.

నీతో బాగుంటే, నువ్వడిగింది చేస్తే, నీ కోరికలు తీర్చి నీ ధనదాహానికి దాసోహం అంటే ఎంతటి వారినైనా ఆకాశానికి ఎత్తి, అందలం ఎక్కిస్తావు. నీ దుర్మార్గాల గురించి, నువ్వు చేస్తున్న తప్పుల గురించి వాళ్ళు ఎత్తి చూపిస్తే వెంటనే నీ గలీజు రాతలతో వారిని అప్రతిష్టపాలు చేసే ప్రయత్నం చేస్తావు.

2001లో జి.వి.కె.రెడ్డి కస్తూరిదేవిని కాజేయాలని చూశాడని... నువ్వేదో పెద్ద సంఘసంస్కర్తలా అడ్డుకున్నావని బాకాలు కొట్టుకుంటున్నావు. ఆరోజు నుండి కస్తూరిదేవి సభ్యుడిగా కొనసాగుతుండిన జి.వి.కె.రెడ్డికి 2011లో పద్మభూషణ్ వస్తే ఏ స్థాయిలో ఆయనను కీర్తించావో మర్చిపోయావా...? అప్పులు ఎగ్గొట్టి బ్యాంకులను దివాళా తీయించారని ఆయనపైన ఇప్పుడు విమర్శలు చేస్తున్నావు. ఎగ్గొట్టడాలు, దివాళా తీయించటాలు నీకున్న గుణాలు. అవి ఇతరులలో ఎత్తి చూపే అర్హత నీకుందా..?

వాడూ, వీడూ కూలిగాళ్ళు అంటూ పత్రిక భాషకి కొత్త అర్థాలు చెప్పి నీ పేపరును ఒక కరపత్రం కంటే హీనస్థాయికి దిగజార్చిన సంస్కారం నీది. కార్పొరేట్ కంపెనీలలో వైస్‌ప్రెసిడెంట్ స్థాయిలో పనిచేసే వ్యక్తులను బౌన్సర్‌లతో పోల్చి కార్పొరేట్ కల్చర్ అంటే తెలియని కార్పొరేషన్ కుప్పతొట్టి స్థాయి నీది. నీ పేపరులో వచ్చిన వార్తకి ఖండనని ప్రకటన రూపంలో అచ్చువేసి డబ్బులు గుంజిన సంస్కృతి నీది. ప్రజలు అన్నీ చూస్తున్నారు, క్షుణ్ణంగా గమనిస్తున్నారు.

> నీతో బాగుంటే, నువ్వడిగింది చేస్తే, నీ కోరికలు తీర్చి నీ ధనదాహానికి దాసోహం అంటే ఎంతటి వారినైనా ఆకాశానికెత్తి, అందలం ఎక్కిస్తావు. నీ దుర్మార్గాల గురించి, నువ్వు చేస్తున్న తప్పుల గురించి వాళ్ళు ఎత్తి చూపిస్తే వెంటనే నీ గలీజు రాతలతో వారిని అప్రతిష్టపాలు చేసే ప్రయత్నం చేస్తావు.

నువ్వు, నీ భజన బృందం కళ్ళు తిరిగేలా కస్తూరిదేవి విద్యాలయ నంగ్లని జి.వి.కె.రెడ్డి, జె.వి.రెడ్డి, దొడ్ల శేషారెడ్డి, మాగుంట పార్వతమ్మలాంటి వాళ్ళు అభివృద్ధి చేసి చూపించిన రోజు ఇదే ప్రజలు నీకు, నీ బృందానికి బుద్ధి చెపుతారు. నువ్వు ఏ ఉద్దేశ్యంతో, ఏ స్వార్థంతో ఇవన్నీ చేస్తున్నావో వాళ్ళు తెలుసుకుంటారు.

ఏ పత్రిక గొప్పదన మైనా ఆ పత్రిక రాసే భాషపై ఆధారపడి ఉం టుంది. విమర్శలు చేసే సందర్భంలో అవి సద్విమ ర్శలుగా ఉండాలి. పది మందినీ అవి ఆకట్టుకోగల గాలి. అప్పుడే ఆ పత్రిక ప్రజాభిమానం చూరగొం టుంది. అలా కాక, పత్రిక పెట్టాము కదా అని బెది రింపు ధోరణితో, బ్లాక్‌మెయిలింగ్ చేస్తూ అసహ్యకరమైన, అవమానకరమైన, అభ్యంతరకరమైన భాష వాడితే అది ఆ పత్రికకున్న 'అసలు స్వరూపం' బయటపెట్టుకున్నట్లవుతుంది. ఇప్పుడు మీ వైపు నుంచి జరుగుతున్నది ఇదే. సమాజంలో గౌరవనీయమైన వ్యక్తులను ముఖ్యంగా ధనికవర్గాలను, ప్రతిష్టాత్మక కుటుంబాలవారిని సైతం బెదిరింపు రాతలతో భయపెడుతూ, వారిని అవమానించే రాతలు రాస్తూ.. వారిపట్ల మీకున్న అక్కసు తీర్చుకుంటున్న వైనం చూస్తే.. ఒకప్పట్లో ఎంతో గొప్పచరిత్ర గలదని మీరు గొప్పలు చెప్పుకుంటున్న పత్రిక..'ఇప్పుడు మరీ ఇంత ఘోరంగా తయారైపోయిందేమిటబ్బా'...అని నెల్లూరీయులు విస్తుపోతున్నారు. ఇంత గబ్బురాతలు గతంలో ఎవరూ ఏ పత్రికలోనూ చూసివుండరు కూడా. నోటికొచ్చినట్లు ఆ రాతలేమిటి?..ఆ అసహ్యపు వ్యాఖ్యలేమిటి?...ముందు ఆ భాష మార్చుకోండి. అలాంటి నీచమైన భాషను పత్రికల్లో వాడడం ఎంతవరకు సమంజసం?... మీకైనా చదవడానికి సిగ్గుగా ఉండడం లేదా?...మీ స్వార్థప్రయోజనాల కోసం.. సమాజంలో గౌరవంగా బతికేవారిని కూడా రచ్చకీడ్చి మీ విషపురాతలతో జనాన్ని ఎంతకాలం భయపెడతారు?.. ప్రజాస్వామ్యానికి పత్రికలు పట్టుగొమ్మలుగా ఉండాలి. కానీ ఆ పత్రికలు మీలా పక్షదారి పట్టగూడదు. ఇప్పుడు తమరి చేతుల్లో పడ్డాక పత్రిక అసలైన పాత్రికేయాన్ని వదిలేసిందా అనిపిస్తోంది. మీ అబద్ధపు రాతలతో, వ్యక్తుల మీద కక్షపూరిత వ్యాఖ్యలతో, వ్యక్తిగత విమర్శలతోనే 'కాలమ్' గడుపుకుంటూ పోతోందా అనిపిస్తోంది. ఒక పత్రికను ఎంతగా భ్రష్టుపట్టించవచ్చో తెలుసుకోవాలనుకునేవారికి మీ పత్రికే ఒక నిదర్శనంగా కనిపిస్తోంది. ఇంతకన్నా మీకెవరైనా చెప్పేదేమీ ఉండదు. 'మా పత్రిక మా ఇష్టం.. మేమేదైనా సరే ఇట్లాగే రాస్తాం' అంటే..ఎవరైనా ఇక చేసేదేమీ ఉండదు.

> సమాజంలో గౌరవనీయమైన వ్యక్తులను ముఖ్యంగా ధనికవర్గాలను, ప్రతిష్టాత్మక కుటుంబాలవారిని సైతం బెదిరింపు రాతలతో భయపెడుతూ, వారిని అవమానించే రాతలు రాస్తూ.. వారిపట్ల మీకున్న అక్కసు తీర్చుకుంటున్న వైనం చూసి నెల్లూరీయులు విస్తుపోతున్నారు.

**2011 జనవరి28వ తేదీన ఇదే జి.వి.కె.రెడ్డి (అప్పుడు కూడా ఆయన కస్తూరిదేవి సభ్యుడే) గురించి ఏం వ్రాశావో ఒక్కసారి గుర్తు తెచ్చుకో...**




పారిశ్రామిక ప్రపంచంలో జీవికె ఒక వెలుగు దివ్వె. గునుపాటి వంశానికి మణిదీపం వంటి వాడాయన. ఆయన నెల్లూరుజిల్లా వాసి కావడం మనకందరికీ గర్వకారణం. అందరు గునుపాటి వంశస్థుల వలెనే కాంట్రాక్టర్‌గా జీవితం ప్రారంభించిన ఆయన పారిశ్రామిక రంగంలోకి అడుగుపెట్టి అంచెలంచెలుగా పైకి ఎదిగాడు. ఇటుక ఇటుక పేర్చుకొంటూ పారిశ్రామిక సామ్రాజ్యాన్ని నిర్మించాడు. అదేమీ పూలబాటలో ప్రయాణం కాదు. ఎన్నో అవరోధాలు, ఎన్నెన్నో ఆటంకాలు, ప్రతిబంధకాలు, ప్రతికూలతలు ఎదుర్కొని, వాటన్నిటినీ అధిగమించి, సఫలీకృతుడైనాడు. ఆయన చేపట్టిన మొట్టమొదటి పరిశ్రమ – బంజారా హోటల్. 1972లో, నగర నిర్మాణ దశలో వున్నప్పుడు ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామి అయ్యాడాయన. 1979లో నోవాపాన్ పరిశ్రమ ప్రారంభించాడు. కొత్తరకం ఉత్పాదన కావడంతో మొదట్లో విపరీతమైన నష్టాలు వచ్చాయి. కార్మిక సమస్యలు తలెత్తాయి. అయినా అధైర్యపడకుండా, ఏళ్లతరబడి ఓర్పు వహించి, దాన్ని నిలబెట్టాడు. ఆంధ్రా నుంచి అమెరికాకు వెళ్లి పరిశ్రమ స్థాపించిన మొట్టమొదటి తెలుగువాడు జీవికె. నార్త్ కరోలినా రాష్ట్రంలో 290 ఎకరాల విస్తీర్ణంలో నెలకొల్పారు దీన్ని.

1990 వరకు జీవికె ఎదుగుదల మెల్ల మెల్లగా, తాబేలి నడకగా సాగింది. ఇక అక్కడి నుంచి కుందేటి పరుగులే. జేగురుపాడులో ప్రైవేటు యాజమాన్యంలో మొట్టమొదటి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మించాడు జీవికె. చాలా పెద్ద సాహసం అది. దేశంలోనే అటువంటి ప్రాజెక్ట్ ఎవరూ చేపట్టలేదు. దానితో ఏ బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థ అప్పు ఇవ్వడానికి ముందుకు రాలేదు. అయినా తెగించి, స్నేహితుల సహకారంతో స్వంత డబ్బు వెచ్చించి కరెంట్ ఉత్పాదన ప్రారంభించే స్థాయికి తెచ్చాడు. ఆయన సాహసం, తెగువ, నైపుణ్యం చూసిన ఆర్థిక సంస్థలు అప్పటి నుంచి ఆయన వెంట పడడం ఆరంభించాయి. గత ఇరవై ఏళ్లలో జీవికె పారిశ్రామిక సామ్రాజ్యం బహుముఖాలుగా విస్తరించింది. ముంబాయి, బెంగుళూరు నగరాలలోని ఎయిర్‌పోర్టులు ఆయనవే. హైదరాబాద్‌లోని మూడు తాజ్ హోటళ్లతో పాటు, బెంగుళూరు, చెన్నై, చండీఘర్ వంటి నగరాలలోనూ హోటళ్లు నిర్మించాడు. ఉత్తరాఖండ్, జమ్మూకాశ్మీర్, ఆంధ్రప్రదేశ్, పంజాబ్ వంటి చోట్ల చాలా విద్యుత్ ప్రాజెక్టులు నిర్మాణంలో వున్నాయి. జైపూర్ నుంచి ఢిల్లీ వెళ్లే జాతీయ రహదారిని ఆధునీకరించడంలో జీవికెది చాలా కీలక పాత్ర. జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్‌లలో బొగ్గు గనులు చేపట్టారు. తమిళనాడులో ఒక ఎస్ఇజడ్ నిర్మిస్తున్నారు. ఇట్లా చెప్పు కొంటూపోతే జీవికె పరిశ్రమలకు అంతమంటూ వుండదు. ఐదు వేల మెగావాట్ల జలవిద్యుత్, పది వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్, 5వేల గదుల హోటల్ చైన్, ఐదు మిలియన్ టన్నుల బొగ్గు, వెయ్యి కిలోమీటర్ల జాతీయ రహదారులు, కనీసం ఐదు అంతర్జాతీయ విమానాశ్రయాలు సాధించడం తన లక్ష్యంగా నిర్దేశించుకొన్నాడు జీవికె. వీటి మొత్తం విలువ రెండు లక్షల కోట్ల రూపాయలు దాటుతుంది. అందుకోసం 75ఏళ్ల వయస్సులో కూడా పసి పిల్లవాడి వలె శ్రమిస్తున్నాడు. జీవికె పారిశ్రామిక అభివృద్ధి వల్ల కొన్ని వేల మందికి ఉపాధి లభిస్తున్నది. కాంట్రాక్టర్‌గా తనకు లభించిన సిరి సంపదలు, వాటితో కలిసి వచ్చే విలాసాలతో సంతృప్తి పడి వుంటే జీవికె మరొక సంపన్నుడిగా మాత్రమే మిగిలిపోయేవాడు. కానీ ఏదో సాధించాలనే తృష్ణ, అందుకోసం పట్టుదల, లక్ష్య దీక్షలతో కష్టపడి పని చేయడం వల్ల, కష్టాలను ఎదుర్కొని విజయం సాధించడం వల్ల ఈరోజు జీవికె పద్మభూషణ్ స్థాయిని చేరుకొన్నాడు

## అయ్యో... అక్కుపక్షీ!....

### నీలా నీచపు వ్రాతలు వ్రాయలేని నేను

# నిరక్షర కుక్షినే!

అయ్యా అక్షర శూరుడా!... నీకు గతంలోనే చెప్పాను, నువ్వు ఓ అంశం(కస్తూరిదేవి విద్యాలయం)పై కథనాలు రాస్తున్నావు. నీ అబద్ధపు రాతల భాగోతాన్ని 'లాయర్' వెలుగులోకి తెస్తోంది. మధ్యలో విషయాన్ని ప్రక్కదోవ పట్టించి విగ్రహాలూ, సన్మానాలూ అంటూ వ్యక్తిగత దూషణకు దిగావు. ఇది సబబు కాదని సున్నితంగా చెప్పాం. కానీ నువ్వు, నీ బుద్ధి మారలేదు. మళ్ళీ "నిరక్షర కుక్షి" అంటూ నాపై వెకిలి వ్యాఖ్యలు చేశావు.

అవును నేను "నిరక్షర కుక్షి"నే. అసలైన జర్నలిజం సిగ్గుపడేలా నీచాతి నీచమైన వ్యాఖ్యలతో వార్తలు వ్రాయడం నీలాంటి "అక్షరాస్యుడి" నైజం అయితే, అలా చేయలేని నేను నిరక్షరాస్యుడినే. నీతి, నియమం, నిబద్ధత తప్పి నైతిక విలువలను తుంగలో తొక్కి వార్తలు వ్రాయడం నీ దృష్టిలో అక్షరాస్యత అయితే అలా రాయలేని నేను నిరక్షర కుక్షినే!

అబద్ధపు నిందలతో, అసత్యపు ఆరోపణలతో, అవాస్తవ కథనాలతో పాఠకులను తప్పుదోవ పట్టించడం నీకు అక్షరాస్యత అనిపిస్తే అది చేతకాని నేను "నిరక్షర కుక్షి"నే!

బ్లాక్ మెయిలింగ్‌లతో, తప్పుడు వార్తలతో స్వార్థపూరిత డిమాండ్లతో విషపు రాతలు రాయడం అక్షరాస్యుడి పాత్రికేయం అయితే అలా ఎప్పటికీ చేయలేని నేను నిరక్షర కుక్షినే. పత్రికలో వ్రాసిన వార్తకు డబ్బులు తీసుకుని ఖండన ప్రకటనగా వేసే వాడు నీ దృష్టిలో అక్షరాస్యుడైతే అలాంటి నీచపు పనులు చేయలేని నేను 'నిరక్షర కుక్షినే'!

చందాలు దందుకుని బ్రతుకుతున్నాడని మరీ మరీ వ్రాస్తున్నావు. నీలాగా చందాలు దండుకోవడం లేదు, దందాలూ చేయడం లేదు. నేను అడక్కుండానే ఆదరించి చేరదీసి అభిమానించి అక్కున చేర్చుకునే ఆత్మీయులనే ఆస్తిగా సంపాదించుకున్నాను.

మోసం, దగా, కుట్ర వంటి చేష్టలు చేసి, నమ్మిన వారిని నట్టేట ముంచే నైజం నాకు లేదు. స్నేహం పేరుతో వ్యక్తులను వాడుకుని అవసరం తీరాక వారితో గొడవపడి పేజీలు పేజీలు వారికి వ్యతిరేకంగా వార్తలు రాసే అలవాటు నాకు లేదు.

అయ్యా... అసలు నీ గురించి మా పత్రికలో నాలుగు లైన్లు వ్రాసినా అది వృధా అనిపిస్తుంది. నీలాంటి 'అక్కుపక్షి' గురించి ప్రచురించే స్థలాన్ని ఒక మంచి వ్యక్తి కోసమో, సమాజ శ్రేయస్సు కోసమో ఉపయోగిస్తే సార్థకత చేకూరుతుంది.

పత్రికా సంపాదకుడినని చెప్పుకుంటూ సంపాదనే ధ్యేయంగా దశాబ్దాల తరబడి హైదరాబాద్‌లో బ్లాక్‌మెయిలింగ్ వ్యవహారాలను వెలగబెట్టి, అక్కడనుండి పెట్టె బేడా సర్దుకుని తగుదునమ్మా అంటూ ఇప్పుడు నెల్లూరుకు వచ్చింది నువ్వు.

పత్రికని కంటికి రెప్పలా కాపాడుకుంటూ ప్రపంచవ్యాప్తంగా లక్షలాదిమంది పాఠకుల అభిమానాన్ని చూరగొన్న మమ్మల్ని గురించి మాట్లాడే నైతిక హక్కు నీకు లేదుగాక... లేదు! ఎవరు ఎంత మాత్రమో, ఎవరి నైతికత, ఎవరి సమర్థత ఏపాటిదో విజ్ఞత కలిగిన నెల్లూరీయులకు బాగా తెలుసు.

పవిత్రమైన విద్యా సంస్థ మనుగడ కోసమే మేము పోరాటం చేస్తున్నాం. ఆ సంస్థ పురోగతి కోసం తొలి నుంచీ ఆరాట పడుతున్నాం. నీతి, నిజాయితీలతో అక్షర కూలీలుగా నిరంతర సమరం సాగిస్తున్నాం తప్ప సంస్కారవంతులపై నీలా 'కూలిగాళ్ళు', 'వాడూ వీడూ' అంటూ సంస్కారహీనమైన వ్యాఖ్యలు చేయడం మాకు చేతకాదు. వ్యక్తిగత దూషణలు అసందర్భ ప్రేలాపనలు మా నైజం కాదు.

ఇక నీకిష్టమొచ్చింది వ్రాసుకో, నీకు చేతనైనన్ని అబద్ధాలను ప్రచురించుకో, నీ 'కుతి' తీరేవరకూ నిందలు వేసుకో. ఇలా చేసే ముందు ఒక్క విషయం మర్చిపోకు... రోజూ ఉదయాన్నే ఇంటి బయటకు వచ్చి కుడివైపుకి తిరిగి నీకెదురుగా కనిపించే సూర్యుడిపై ఓసారి ఉమ్మి చూడు... ఫలితం నీకే తెలుస్తుంది.

నీ చెప్పుడు మాటలు నమ్మి, నీ కట్టుకథలకు మోసపోయి విద్యాలయంపై ఉద్యమాలంటూ నీ చేతుల్లో కీలుబొమ్మగా మారిన కుర్రా వసుంధర తన ఫేస్‌బుక్ హోమ్‌పేజీలో పెట్టిన కొటేషన్‌లో ఇలా వ్రాసుకుంది....

"బలహీనుడు వ్యక్తుల గురించి మాట్లాడుతాడు, వ్యక్తుల కోసం పని చేస్తాడు.

బలవంతుడు వ్యవస్థల గురించి మాట్లాడుతాడు, వ్యవస్థల కోసం పని చేస్తాడు."

కనీసం ఆమె చెప్పిన మాటనైనా విని తెలివి తెచ్చుకో.

మేము ఆ రెండవ కోవకి చెందినవాళ్ళమని గుర్తు పెట్టుకో!...

# గూడూరు డివిజన్ వార్తలు

## ఎయిడ్స్ నిర్మూలనకు...
# అందరూ కృషి చేయాలి
**- డిఎస్పీ రాంబాబు**



ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని గూడూరు డిఎస్పీ రాంబాబు కోరారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా గూడూరులోని వరల్డ్ విజన్ ఇండియా, అరవ వెంకటమ్మ చారిటబుల్ ట్రస్ట్, వైజెపి లయన్స్‌క్లబ్, ఆంధ్ర మహిళామండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 1న స్థానిక డిఆర్‌డబ్ల్యు కళాశాల విద్యార్థినులు ర్యాలీ నిర్వహించి గడియారపు స్తంభం సెంటర్‌వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయేషాకి ఆమె 20వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ కల్యాణరాజు, కళాశాల ప్రిన్సిపాల్ భారతలక్ష్మి, అరవ వెంకటమ్మ చారిటబుల్‌ట్రస్ట్ ప్రతినిధులు అరవ పార్వతమ్మ, శ్రీనివాస్‌సాథే, డాక్టర్ చంద్రహాస్, బాబురావు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌బికెఆర్‌లో..
# అధ్యాపకులకు శిక్షణ




విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 3న '3-డి ఎక్స్‌పీరియన్స్ ఇన్ కెటియా అండ్ ఎనోవియా' అనే అంశంపై అధ్యాపకులకు శిక్షణ ప్రారంభించారు. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ (బెంగుళూరు) జనరల్ మేనేజర్ సి.గంగారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ, ఏరోస్పేస్, ఆటోమొబైల్, హెల్త్‌కేర్ విభాగాల్లో ప్రొడెక్ట్ డిజైన్ నిపుణులకు అపార అవకాశాలున్నాయని చెప్పారు. విభాగాధిపతి డా.సిహెచ్‌ఆర్ విక్రమకుమార్ మాట్లాడుతూ, సుమారు కోటి రూపాయల వ్యయంతో డసాల్ట్ ఆఫ్ ఎక్స్‌లెన్సీని నెలకొల్పామని, డసాల్ట్ ఆథరైజ్డ్ సర్టిఫికేషన్ సెంటర్ ద్వారా తమ కళాశాలలో సర్టిఫికేషన్ పరీక్షలకు అర్హులైన అభ్యర్థులు హాజరుకావచ్చని తెలిపారు. కళాశాల డైరెక్టర్ డా. వి.విజయకుమార్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు సిహెచ్ రామకృష్ణ, ఎం. వెంకటేశ్వర్లుతో పాటు అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నారులకు వరల్డ్‌విజన్ సాయం



చిన్నారులకు సరుకులు పంపిణీ చేస్తున్న గూడూరు సబ్‌కలెక్టర్ ఆనంద్ తదితరులు

అనారోగ్యంతో ఉన్న పలువురు పేదలకు గూడూరులోని వరల్డ్ విజన్ సంస్థవారు సరుకులు పంపిణీ చేసి తమ ఉదారతను చాటుకున్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయం సమావేశ మందిరంలో జేవివి సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సబ్‌కలెక్టర్ ఆనంద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ సమాజంలో రోగులకు, బాధితులకు ఆపన్నహస్తం అందించడం అభినందనీయమన్నారు. జేవివి ప్రతినిధులు రామ్మోహన్ రావు, రాజేంద్రప్రసాద్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈనెల 3న గూడూరు రైల్వేస్టేషన్‌లోని విఐపి లాంజ్‌లో ఆరుగురు దివ్యాంగులను సన్మానిస్తున్న గుంతకల్ రైల్వే డివిజన్ డిఆర్‌యుసిసి మెంబర్, శ్రీకృష్ణ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మయూరి శ్యాంయాదవ్.

# 8 నుండి రంగడి అధ్యయనోత్సవాలు
## 18న వైకుంఠ ద్వార దర్శనం...

ఉత్తర శ్రీరంగంగా పేరుమోసిన నెల్లూరు రంగనాయకుల పేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానంలో ఈనెల 8 నుండి 28వతేదీ వరకు అధ్యయనోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. 8 వ తేదీ నుండి 17వ తేదీ వరకు ప్రతి రోజు సాయంత్రం 7 గంటలకు పగల్ పత్తు ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. 18వ తేదీ మంగళవారం ముక్కోటి ఏకాదశి వైకుంఠ ద్వారదర్శనాన్ని తెల్లవారుజామున 4.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు భక్తులకు ఉచిత దర్శనం కల్పిస్తున్నారు. విఐపి దర్శనాన్ని ఉదయం 6 నుండి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుండి 6 గంటల వరకు మాత్రమే కల్పిస్తున్నారు. రాపత్తు ఉత్సవాలను ఈనెల 18 నుండి 28 వ తేదీ వరకు ప్రతిరోజు సాయంత్రం 7 గంటలకు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామివారికి కృపకు పాత్రులు కావాలని ఆలయ కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్ రెడ్డి కోరుతున్నారు.

# ఆటోవాలాలపై దృష్టి పెట్టిన ఎస్పీ

నెల్లూరు నగరంలో వేల సంఖ్యలో విచ్చలవిడిగా స్వైరవిహారం చేస్తున్న ఆటో రిక్షాలపై కొత్త ఎస్పీ దృష్టి సారించాడు.. ఇటీవల మద్యం తాగి ఆటో నడుపుతూ ఎస్పీ కారునే ఓ ఆటో ఢీ కొనడంతో ఆయన ఖంగుతిన్నట్లున్నాడు. ఆటోవాలాలను పిలిపించి క్లాస్ పీకడమే కాకుండా నియమ నిబంధనలు తెలియజేసాడు.

ఈనెల 1 న నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లోని ఉమేష్ చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లకు అవగాహనా సదస్సు నిర్వహించారు. మద్యం తాగి ఆటోలు నడపరాదని, డ్రైవర్ సీటు ప్రక్కన ప్రయాణీకులను కూర్చోపెట్టుకోకూడదని, ఎక్కడ పడితే అక్కడ ఆటోలను ఆపకుండా పార్కింగ్ ప్రదేశాల్లో నిలపాలని ఎస్పీ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు, యూనియన్ నాయకులు తెలిపిన పలు సమస్యలపై సానుకూలంగా స్పందించి వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఐశ్వర్య రస్తోగీ హామీ ఇచ్చారు.

# సిద్ధలయ్యకోనలో వనభోజనాలు

గూడూరు సరస్వతి శిశుమందిర్ విద్యార్థులైన సుమారు 70 మంది పిల్లలకు, మరియు పెద్దలకు, భక్తులకు స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వాకాటి రామ్మోహన్, డిస్ట్రిక్ట్ ఛైర్మెన్ ఎం.మురళీరెడ్డిల ఆధ్వర్యంలో ఇటీవల వనభోజనాలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా తొలుత కోనలో వెలసివున్న ఆలయానికి వెళ్ళి స్వామిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు జి.చంద్రశేఖర్, పిఆర్‌ఓ కడివేటి చంద్రశేఖర్, హెడ్‌మాస్టర్ పోతన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సంతాప సభ



ఇటీవల మృతిచెందిన సీనియర్ ఫోటోగ్రాఫర్ ఉమామహేశ్వరరావు, విలేకరి కాలేషాలకు నివాళులర్పిస్తూ గూడూరు ఎంపిడిఓ కార్యాలయంలో ఈనెల 1న సంతాపసభ నిర్వహించారు. ఫోటో-వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పాల్గొని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతిచెందిన వారి కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు చిరంజీవి, రత్నం, రసూల్, సుధాకర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తరక్రియలు



**శ్రీమతి వంకి శంకరమ్మ గారు**

తేది 01-12-2018 శనివారము స్వర్గస్తులైనారు.

**తేది: 13-12-2018 గురువారం**

ఉదయం గం॥ 9-00 లకు

నెల్లూరు, దర్గామిట్ట, శ్రీరాజరాజేశ్వరి దేవస్థానం ఎదురువీధి, రెవెన్యూ కాలనీలోని మా స్వగృహమునందు "పెద్దకర్మ" జరుగును. కావున తెలియజేయడమైనది.

కీ॥శే॥ శ్రీమతి వంకి శంకరమ్మ గారు

**ఇట్లు**

కుమార్తెలు, అల్లుళ్ళు:
శ్రీమతి బి.ఆదిలక్ష్మి మరియు కుటుంబసభ్యులు
ఓగు వెంకటేశ్వర్లు - శ్రీమతి పద్మావతి,
ఓగు నాగేశ్వరరావు - శ్రీమతి ప్రభావతి,
శ్రీమతి గోతం విజయమ్మ మరియు కుటుంబసభ్యులు
వంకి బ్రదర్స్ మరియు కుటుంబసభ్యులు

భర్త:
వంకి ఆదిశేషయ్య
కుమారుడు:
డా॥ వంకి పెంచలయ్య-శ్రీమతి ప్రసూన్న
ఛైర్మెన్,ఆది-శంకర విద్యాసంస్థలు.



నెల్లూరులో జరిగిన గూడూరు ఆదిశంకర విద్యాసంస్థల అధినేత వంకి పెంచలయ్య మాతృమూర్తి శంకరమ్మ అంతిమయాత్రలో పాల్గొని ఆమె పార్థివదేహానికి నివాళులర్పించిన గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, మాజీమంత్రి పరసా రత్నం, గూడూరు డిఎస్పీ రాంబాబు

# లోకేష్‌కు ఇంటర్నేషనల్ అవార్డు

హైటెక్ రత్న, నవ్యాంధ్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు తెలంగాణలో ఎన్నికల సభలు ముగించు కుని గ్రాఫిక్స్ రాజధాని అమరావతి ఉండవల్లిలోని తన ఇంటికి చేరుకున్నాడు. ఆయన అక్కడికి వెళ్లేసరికే అప్పటికే అక్కడ దేవగుడి ఆదినారాయణరెడ్డి, జయ రామయ్య, భూమా అఖిలప్రియ, మణి గాంధీ, జలీల్‌ఖాన్, జ్యోతుల నెహ్రూ, సుజయ్ రంగారావు, పాశం సునీల్, గిడ్డి ఈశ్వరి, మేతుకు రాజేశ్వరి, గొట్టిపాటి రవికుమార్, అమర్‌నాథ్ వంటి 22మంది దాకా వైసిపి నుండి తెలుగుదేశంలో దూరిన ఎమ్మెల్యేలున్నారు. వాళ్లను చూడగానే చంద్రబాబు మనసులో... ఈ జంపింగ్ బ్యాచ్ అంతా కట్టకట్టుకుని వచ్చిందేటబ్బా అనుకుంటూ వారివైపు తీక్షణంగా చూశాడు. అందరి ముఖా లలోనూ కోపంతో కూడిన ఆక్రోశంతో మిళితమైన ఆవేశం కనిపిస్తోంది. వీళ్లెక్కడో హర్ట్ అయ్యారని పసిగట్టిన చంద్రబాబు... ఏంటి సంగతి అని అడి గాడు. వెంటనే జలీల్‌ఖాన్... ఎంత ఒకవేళ మేం బికాంలో ఫిజిక్స్ చదివి నోళ్ళమైతే మాత్రం మీ కంటికి అంత చీప్‌గా కనిపిస్తున్నామా? అని కోపంగా అడిగాడు. ఏ విషయం మీరు మాట్లాడు తున్నారని చంద్రబాబు అడిగాడు. అమర్‌నాథ్‌రెడ్డి వెంటనే... తెలంగాణ ప్రచార సభలలో ఏమన్నారు, ఒక పార్టీ గుర్తు మీద గెలిచి ఇంకో పార్టీలో చేరిన వాళ్ళను ఓడించమని పిలుపునిస్తారా? రేపు ఇక్కడ కూడా మీరు చెప్పబోయేది అదే కదా! మేమంతా ఓడిపోవాలనే కదా మీ ఉద్దేశ్యం అని అన్నాడు. అందుకు చంద్రబాబు ఎప్పుడూ లేని విధంగా ఎస్.వి.రంగారావు లెవల్లో నవ్వి... మీ తెలివి తెల్లారినట్లే వుంది... ఈరోజు మాట్లాడిన దానికి పూర్తి వ్యతిరేకంగా నేను పక్కరోజే మాట్లాడగలను, అట్లాంటిది ఏపి ఎన్నికలకు ఇంకా ఆరునెలలు న్నాయి... ఇంకెన్ని మాటలు మార్చొచ్చు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ నుండి టిఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యేలు ప్రజా స్వామ్య ద్రోహులు... కాని ఆంధ్రాలో అలా కాదు, వైసిపి నుండి తెలుగుదేశంలో చేరినవాళ్ళంతా అభివృద్ధి వాంఛితులు, ప్రజాస్వామ్య రక్షకులు. రాజ్యాంగస్ఫూర్తి ప్రదాతలు. మీకు చిన్న ఎగ్జాంపుల్ చెబుతాను... గంగానదిలో ఓ బకెట్ నీళ్ళు తీసి మురికి కాలువలో పోస్తే ఏమవుతాయి అని అడిగాడు. అవి కూడా మురికి నీళ్ళే అవుతాయి అని ఆది నారాయణరెడ్డి చెప్పాడు. మరి అదే మురికి కాలువను గంగానదిలో కలిపితే ఏమవుతుంది అని చంద్రబాబు మళ్ళీ అడిగాడు. మురికి నీళ్ళు కూడా పవిత్ర గంగాజలం అవుతాయని సుజయ్‌రంగా రావు చెప్పాడు. దీన్ని బట్టి మీకు పొలిటి కల్ లాజిక్ అర్ధమైవుంటుంది. తెలుగు దేశం గంగా నది లాంటిది. కాబట్టి ఇక్కడ నుండి వెళ్ళినవాళ్ళు పాపాత్ములవుతారు. ఇందులోకొచ్చిన వాళ్ళు పుణ్యాత్ములవు తారు. ఏపి ఎలక్షన్లలో ఆల్‌రెడీ మీ కోసం ఒక స్లోగన్ సిద్ధం చేసాను. 'అభివృద్ధి కోసం, ప్రజాస్వామ్య విలువల కోసం తెలుగుదేశంలో చేరిన త్యాగమూర్తు లను భారీ మెజార్టీతో గెలిపించండి' అని పిలుపునివ్వబోతున్నాను అని చెప్పాడు. ఆ మాటలు విన్న జంపింగ్ ఎమ్మెల్యే లంతా... మీలాంటి నాయకుడు అండగా మాకు ఉండగా... ఇంకేం దిగులు అను కుంటూ అక్కడనుండి బయలుదేరారు.

వాళ్ళటు వెళ్ళగానే ముదురుదోమల శాఖ మంత్రి, నైట్‌రైడర్ పి.నారాయణ పరుగెత్తుకుంటూ వచ్చి... సార్, మన అమరావతికి మరో రికార్డు వచ్చింది అని రొప్పుతూ చెప్పాడు. చంద్రబాబు వెంటనే ప్యూన్ చేత ఒక గ్లాసు వాటర్ తెప్పించి నారాయణకిచ్చి... ముందు ఇవి తాగి ఆ గస తగ్గించుకో... తీరిగ్గా ఏమైందో చెప్పు అని అన్నాడు. నారాయణ నీళ్ళు తాగి రెండు నిముషాలకు రిలాక్స్ అయ్యి... సార్, మన అమరావతికి ఊహించని రికార్డు దక్కింది. ఇప్పటి వరకు భారతదేశంలో గొప్ప గ్రాఫిక్స్ సినిమాలుగా బాహుబలి, రోబో అని అనుకుంటున్నామా? కాని ఒక సంస్థ వాళ్ళు వీటిలో ఏ గ్రాఫిక్స్ బాగున్నాయని రోబో, బాహుబలి, అమరావతి... ఈ మూడింటి మధ్య ఆన్‌లైన్ కాంపిటీషన్ పెడితే 70శాతం మంది అమరావతి గ్రాఫిక్స్‌కే మద్దతు తెలిపారని చెప్పాడు. అది విన్న చంద్రబాబు శెభాష్ నారా యణ... మంచి వార్త చెప్పావు... మన ఆస్థాన మీడియాలో ఈ కీర్తిని ప్రచారం చేయించండి. గ్రామాల నుండి ప్రధాన నగరాల వరకు అన్ని చోట్ల దీనిపై ఫ్లెక్సీలు వేయించండి... ప్రతి జిల్లాలో వారం రోజుల పాటు 'అమరావతి గ్రాఫిక్స్ విజయోత్సవ వేడుకలు' నిర్వహించండి, దీని కోసం జిల్లాకో 10కోట్లు మంజూరు చేస్తున్నాను అని ప్రకటించాడు. అలాగే సార్, అంటూ నారాయణ అక్కడనుండి వెళ్లిపోయాడు.

చంద్రబాబు లోపలకెళ్లి స్నానం చేసి డైనింగ్ టేబుల్ వద్దకు వచ్చాడు. భువనేశ్వరీదేవి ఒక్కోటి 15గ్రాముల బరువుండే రెండు పుల్కాలు, దాంట్లో 10గ్రాముల పప్పు వడ్డించింది. అర నిముషంలో వాటిని తిన్న చంద్రబాబు... ఇంకో పుల్కా వేయవా అని అడిగాడు. అందుకు భువనేశ్వరి ఏం వెలగబెడు తున్నారని ఇంకో పుల్కా పెట్టాలి, అసలే ఆస్తులు తగ్గిపోయి అప్పుల్లో వుంటు న్నారు. మీకంటే దేవాన్ష్ నయం. 18కోట్ల ఆస్థి సంపాదించాడు అని చెప్పింది. అప్పుడు చంద్రబాబు మనసులో... ఎంత ముఖ్యమంత్రినైతే ఏం లాభం, కడుపుకు ఇంకో ఎగ్‌స్ట్రా పుల్కా తినలేకపోతిని, రేపట్నుండి ఇలా కాదు, మూడు పూటలా అన్న క్యాంటీన్‌లో తింటే సరి, రోజుకు 15రూపాయలతో పోతుంది అనుకుని హాల్‌లోకి వచ్చి టీవీ ఆన్ చేసి ఎబిసి ఛానెల్ పెట్టాడు. అప్పుడే ఫ్లాష్ న్యూస్ వస్తోంది... "ప్రపంచ ప్రతిభావంత యువనేతల్లో ఒకరిగా నారా లోకేష్"... ఈ న్యూస్ చూసి చంద్రబాబే షాక్‌కు గురయ్యాడు. ఆ షాక్‌లో ఆయన అక్కడే సోఫాలో కూలబడి నిద్రపోయాడు.

★★★★★

అదోపెద్ద హాల్... 'దిబిడి దిబిడే' సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమం అది. మన్మోహన్‌సింగ్, ములాయం సింగ్ యాదవ్, మాయావతి, సోనియాగాంధీ, చంద్రబాబునాయుడులు అతిథులుగా వచ్చారు. దిబిడి దిబిడే సంస్థ సారథి డబ్బా డబాల్కర్ మైక్ ముందు మాట్లా డుతూ... మా సంస్థ ఆన్‌లైన్ సర్వే చేయగా... అత్యంత ప్రభావశీలవంతమైన నేతల్లో నారా లోకేష్ అగ్రస్థానంలో నిలిచారు. ఈ విషయంలో ఆయన రాహుల్‌గాంధీని సైతం మించిపోవడం విశేషం. కాబట్టే ఈరోజు ఆయనకు ఈ ముఖ్యఅతిథుల చేతుల మీదుగా 'ఉత్తమ ప్రపంచ యువనేత' అవార్డును ప్రదానం చేస్తున్నామని ప్రకటించాడు. అప్పుడు సభ మధ్యలో నుండి... ఆపండి అన్న కేకలు వినిపించాయి. అందరూ అటు చూసారు. అక్కడ వై.యస్.జగన్మోహన్‌రెడ్డి, కేటీఆర్‌లు వున్నారు. ఎందుకు ఆపమ న్నారని డబ్బా డబాల్కర్ ప్రశ్నించాడు. అప్పుడు కేటీఆర్... లోకేష్ ఎందులో గొప్ప అని ఈ అవార్డు ఇస్తున్నారు. 40 ఏళ్ళ వయసులోనే పార్టీని పెట్టి 67 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకున్న జగన్‌కంటే గొప్పోడా? తెలంగాణ ఉద్య మంలో ముందుండి నడిచి, గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు వంద సీట్లు తెప్పించిన నాకంటే గొప్పోడా? యూపిలో సీఎంగా పనిచేసిన యువనేత అఖిలేష్ యాదవ్ కంటే మెరుగైనవాడా? ఎందుకు ఇస్తున్నారు ఆయనకు ఆ అవార్డు అని ప్రశ్నించాడు. అప్పుడు డబ్బా డబాల్కర్... మీ అందరి కంటే కాదు, ప్రపంచంలోని అందరి యువనేతల కంటే గొప్పోడు లోకేష్‌బాబు. తన సొంత పార్టీనే ఈ దేశంలోనే అత్యంత అవినీతి పార్టీ, కులపిచ్చి, మత పిచ్చి వున్న పార్టీగా ప్రకటించిన ధైర్యశాలి, వర్ధంతులకు సైతం ప్రజలకు శుభా కాంక్షలు చెప్పగల మానవతావాది, ఆయన ఏం మాట్లాడినా సంచలనం... ఆయన ఏం చేసినా అద్భుతం. ఆయన ప్రసంగాల వీడియోలు అంతర్జాతీయంగా సోషల్ మీడియాను ఒక ఊపు ఊపే స్తున్నాయి. ఈనాటి యువసమాజాన్ని ఆయన తన ప్రసంగాలతో అలా ఆకట్టు కుంటున్నారు. ఈ విషయంలో రాహుల్ గాంధీ కూడా ఆయనతో పోటీ పడలే కున్నారు. అలాంటి యువనేతకు ఈ అవార్డు ఇవ్వడం తప్పెలా అవుతుంది అని ప్రశ్నించాడు. తప్పే లేదు అన్నట్లు కేటీఆర్, జగన్‌లు ఇద్దరూ తలలు దించుకున్నారు. లోకేష్ నేరుగా వేదికనెక్కి మన్మోహన్‌సింగ్, సోనియాగాంధీల చేతుల మీదుగా అవార్డు తీసుకుంటుం డగా, సభలో చప్పట్లు మార్మోగాయి. పుత్రోత్సాహంతో చంద్రబాబు కూడా చప్పట్లు కొట్టసాగాడు. అలా కొడుతూనే వున్నాడు.

అప్పుడు ఆయన ఒంటిపై ఎవరో చెయ్యేసి... ఏమండి ఏమండి అని తట్టారు. అప్పుడు చంద్రబాబు ఉలిక్కిపడి లేచాడు. చుట్టూ చూసాడు. సభ లేదు, సన్మానం లేదు... తాను సోఫా మీద వున్నాడు. ఎదురుగా భువనేశ్వరి వుంది. ఏమైందని చంద్రబాబును ఆమె అడిగింది. తనకు వచ్చింది కల అనే విషయం అర్ధమైన చంద్రబాబు ఆ కల గురించే ఆమెకు చెప్పాడు.

# సొమ్ము కేంద్రానిది.. సోకు 'చంద్రా'నిది

## ముఖ్యమంత్రి తీరుపై బిజెపి నాయకుల ధ్వజం

ఇదేం చోద్యం.. దేశప్రజల సంక్షేమం కోసం ప్రధాని మోడీ సారధ్యంలో కేంద్రప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడితే ఆ పథకాలన్నీ తనవేనంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆర్భాటపు ప్రకటనలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతుండడం చూస్తే సొమ్మొకరిది.. సోకొకరిది అన్నట్లుగా ఉందంటూ బిజెపి నాయకులు తీవ్రంగా ధ్వజమెత్తారు.

ఈనెల 1న ఆత్మకూరులోని త్రికోటేశ్వర కల్యాణమండపంలో జరిగిన బిజెపి నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశంలో బిజెపి నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవహరిస్తున్న తీరుపై వ్యంగ్యాస్త్రాలు విసిరారు. బిజెపి అధికారప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ, సొంత మామనే వెన్నుపోటు పొడిచిన బాబు ఎవరినైనా మోసం చేయగలడని ప్రస్తుతం పొత్తు పెట్టుకున్న నాయకులకు భవిష్యత్తులో అర్ధమవుతుందని ఎద్దేవా చేశారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి ఊతమిస్తోంది కేంద్రప్రభుత్వమేనని, ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి 13వేల రూపాయలు కేంద్రం ఇస్తుంటే, కేవలం 2వేలు మాత్రమే తన వాటాగా ఇచ్చే రాష్ట్రప్రభుత్వం ఆ పథకం తన సొంతపథకంగా డబ్బాకొట్టుకోవడం ఏమిటని ప్రశ్నించారు. జన్మభూమి కమిటీల పేరుతో కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారంటూ ఆయన ఈ సందర్భంగా టిడిపి నేతలను తూర్పారబట్టారు. కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న భేటీపడావో, భేటీ బచావో, ప్రమాదబీమా యోజన, ముద్ర యోజన, స్వచ్ఛ భారత్, ప్రతిఒక్కరికీ ఇల్లు.. వంటి పథకాలను వాటి ప్రయోజనాలను ఇంటింటికీ వెళ్ళి ప్రజలందరికీ తెలియజెప్పేందుకు బిజెపి కార్యకర్తలు, నాయకులు కృషిచేయాలని, కేంద్ర ప్రభుత్వ పథకాల పేరుమార్చి ఆ పథకాలు నావేనంటున్న చంద్రబాబు తీరును ప్రజలకు వివరించాలని ఆయన కార్యకర్త లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె.బుజ్జిరెడ్డి, నాయకులు సిహెచ్ రమణయ్యనాయుడు, నాగరాజారెడ్డి, భాస్కర్, కె.సుధాకర్, శ్రీనివాసులు, రమణారెడ్డి, విజయలక్ష్మి, బత్తుల కృష్ణయ్య పాల్గొన్నారు.

# పోలీసుల దెబ్బకు.. యువత బెంబేలు

ఇష్టారాజ్యంగా త్రిపుల్ డ్రైవింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేస్తూ విచ్చలవిడిగా తిరుగుతున్న యువతకు పోలీసులు చెక్ పెట్టారు. నేర నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్దీకరణలో భాగంగా నెల్లూరు పోలీసులు ఈనెల 4వ తేదీ రాత్రి అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ప్రధాన సెంటర్లలో సీఐలు, ఎస్సైలు మఫ్టీలో తమ సిబ్బందితో కలిసి త్రిపుల్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, వాహన పత్రాలు లేకుండా తిరుగుతున్న వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న కొంతమందికి కౌన్సిలింగ్ ఇచ్చి ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటిస్తామని వారిచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ తనిఖీల్లో సంతపేట, చిన్నబజార్, వేదాయపాళెం, బాలాజీనగర్ సీఐలు పాపారావు, అబ్దుల్ సుభాన్, నరశింహారావు, జి. వేణుగోపాలరెడ్డి, ఎస్సైలు గోపాల్, ప్రతాప్, నారాయణ, సుభాన్, ఆలీ సాహెబ్, కొండయ్య పాల్గొన్నారు.

# అమర గాయకుడు ఘంటసాల

అమర గాయకుడు ఘంటసాలని అందరినోట పిలిపించుకున్న సంగీత స్రష్ట ఘంటసాల వెంకటేశ్వరరావని ద్యూటీస్ స్వచ్ఛంద సేవాసంస్థ ఛైర్మన్ నూనె వెంగయ్య అన్నారు. ఈనెల 4న నెల్లూరు కొండాయపాళెంలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో ఘంటసాల జయంతి కార్యక్రమం జరిగింది. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్కూలు ప్రధానోపాధ్యాయుడు యం. భాస్కరరావు మాట్లాడుతూ 1960 లో వచ్చిన శ్రీ వేంకటేశ్వర మహత్యం చిత్రంలో శేషశైలావాస.. శ్రీ వెంకటేశా పాటను ఘంటసాలపైనే చిత్రీకరించడం విశేషమని కొనియాడారు. భవాని నాగేంద్రప్రసాద్, హరీష్, తాటిపర్తి వెంకటరమణయ్య, మురళీమోహన్‌రాజు పాల్గొన్నారు.



స్వర్గీయ శ్రీకంటి వెంకటరత్నం గారు
ఎడిటర్ & కవి
మరణం : 2-12-1972

46వ వర్ధంతి

మా తండ్రిగారైన శ్రీకంటి వెంకటరత్నం గారు దైవసన్నిధి చేరి 46 సం||లు గడిచినా మీ జ్ఞాపకాలు మా మదిలో చిరస్థాయిగా నిలిచేవుంటాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ..

| కుమారులు | కోడళ్లు |
|---|---|
| శ్రీకంటి రామమోహనరావు | మాలతి |
| శ్రీకంటి రమణమూర్తి | రాజ్యలక్ష్మి, సీతమ్మ |

| కుమార్తెలు | అల్లుళ్లు |
|---|---|
| కారుమంచి ఇందిర | ఉపేంద్రనాథరావు |
| యరగుడిపాటి వసంత | ప్రభాకరరావు |
| మద్దాళి వసుప్రద | వెంకటకృష్ణారావు |

మనుమరాలు: వెంకటమణ్ణాశ్రీతి - కామేశ్వర్
మనుమడు: S.V.మనోజ్‌కుమార్
మునిమనుమడు: ఆర్యన్
S.V. రత్నం & కో. స్టాఫ్, గూడూరు.

# నలుబోలుకు డబుల్ ధమాకా



స్వీట్ బలరామన్నగా పేరు సంపాదించుకున్న నెల్లూరు ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు, ఆయన చేసిన సేవలకుగాను బెస్ట్ ప్రెసిడెంట్, ఎక్స్‌లెంట్ సర్వీస్ అవార్డులను కైవసం చేసుకున్నాడు. ఈనెల 2న గుంటూరు డీఎస్ కల్యాణ మండ పంలో వాకర్స్ ఇంటర్నేషనల్ 203 డిస్ట్రిక్ట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2018 సంవత్సరానికిగాను అత్యుత్తమ సేవలందించిన బలరామయ్యకు ఈ అవార్డులు అందజేసి సత్కరించారు. ముఖ్యఅతిధులుగా గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా, 203 వాకర్స్ గవర్నర్ రామ కృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడుతూ విద్య, వైద్య సామాజిక రంగాలలో ఫ్రెండ్స్ వాకర్స్ చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. చెలికాని సీతారామయ్య, యం.వి.సుబ్బారెడ్డి, బి.మనోహర్‌రెడ్డి, వాకర్స్ సభ్యులు చెంచయ్యనాయుడు, ప్రసాద్, శివయ్య పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యం సస్పెండ్

పంచాయితీ కార్యదర్శులుగా ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ డబ్బులు వసూలు చేసినందుకు నెల్లూరు జిల్లా పరిషత్ మాజీ సీఇఓ సుబ్రహ్మణ్యంను ఈనెల 5న జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు సస్పెండ్ చేసారు.



# సుమంత్‌కు కోవూరు కాంగ్రెస్ బాధ్యత

నెల్లూరుజిల్లా కేంద్ర సహకార మార్కెటింగ్ సొసైటీ ఛైర్మెన్ ఏదుగుండ్ల సుమంత్‌రెడ్డిని కోవూరు నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. పిసిసి అధ్యక్షుడు రఘువీరారెడ్డి ఆదేశాల మేరకు 3వ తేదీ నెల్లూరులోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించడం జరిగింది.

మాజీ ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డికి దగ్గరి బంధువైన సుమంత్‌రెడ్డి 2009 ఎన్నికలలోనే కోవూరు కాంగ్రెస్ టిక్కెట్ కోసం ప్రయత్నించాడు. అప్పుడు సిటింగ్ ఎమ్మెల్యేగా వున్న పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డికే సీటిచ్చారు. కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా వుండగా 2013లో జరిగిన జిల్లా కాంద్ర సహకార బ్యాంకు ఎన్నికల్లో డిసిసిబి ఛైర్మెన్ పదవిని ఆశించాడు. అయితే అప్పట్లో ఆనం అనుచరుడైన మెట్టుకూరు ధనుంజయ రెడ్డికి ఆ పదవి ఇవ్వాల్సి వచ్చింది. దీంతో సుమంత్‌రెడ్డిని డిసిఎంఎస్ ఛైర్మెన్‌గా నియమించారు. 2014 నుండి రాష్ట్రంలో ఎన్నో రాజకీయ మార్పులు జరిగి ఎంతోమంది నాయకులు పార్టీలు మారినా సుమంత్ మాత్రం కాంగ్రెస్‌ను వదల్లేదు. అందుకే పిలిచి మరీ ఆయనకు కోవూరు పార్టీ బాధ్యతలు అప్పగించారు. పాలు ఇచ్చేటప్పుడు పాడి అవును అడిగితే ఇవ్వలేదు. ఇప్పుడు అడగకుండానే ఒట్టిపోయిన గేదెను అంటగట్టారు. మరి సుమంత్‌రెడ్డి ఎంతకాలం మేపుకుంటాడో చూద్దాం!

## కాలధర్మం

### ఉక్కాల రాజేశ్వరమ్మ




నెల్లూరు మాజీ పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి ఉక్కాల రాజేశ్వరమ్మ ఈ నెల 1వ తేదీన తన 70వ యేట కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు. నెల్లూరు పార్లమెంటు నుండి మూడుసార్లు ప్రాతినిధ్యం వహించిన దొడ్డవరపు కామాక్షయ్య కుమార్తె రాజేశ్వరమ్మ. అనంతసాగరం మండలంలోని శంకర నగరం కామాక్షయ్య స్వగ్రామం. కొడవలూరు మండలం కొత్తవంగల్లుకి చెందిన డాక్టర్ ఉక్కాల ప్రకాశ్‌రావుతో ఆమెకు వివాహం జరిగింది. ఇద్దరూ డాక్టర్లు కావడంతో బుచ్చిరెడ్డిపాలెంలో ఆసుపత్రి నెలకొల్పి దాదాపు 40ఏళ్ల పాటు ఆ మండల ప్రజలకు వైద్యసేవలందించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఆ పార్టీలో వున్న ఉక్కాల రాజేశ్వరమ్మకు 1999 మధ్యంతర ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంటు స్థానం నుండి పోటీ చేసే అవకాశం లభించింది. ఆ ఎన్నికల్లో ఆమె విజయం సాధించి పార్లమెంటులో అడుగుపెట్టారు. 2004 ఎన్నికల్లో గూడూరు అసెంబ్లీ నుండి పోటీ చేసి ఆమె పరాజయం పొందారు. ఆ తర్వాతకాలంలో ఆమె రాజకీయాలకు దూరమవుతూ వచ్చారు. ఒక డాక్టర్‌గా, పార్లమెంటు సభ్యురాలిగా తనకు సాధ్యమైనంతలో పదిమందికి మంచి చేశారు. ఆమె మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### వేములూరి గంగాదేవి



ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థ 'కళానికేతన్' వ్యవస్థాపకులు, విజయవాడ వాస్తవ్యులు స్వర్గీయ వేములూరి వెంకటేశ్వరరావు గారి సతీమణి శ్రీమతి వేములూరి గంగాదేవి గారు నవంబర్ 30వతేదీ శుక్రవారం పరమపదించారు. ఆమె వయస్సు 73 సంవత్సరాలు. ఆమెకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. 1978లో కళానికేతన్ సంస్థను ప్రారంభించిన వెంకటేశ్వరరావు గారికి సహాయసహకారాలందిస్తూ వ్యాపార పురోభివృద్ధికి గంగాదేవి శక్తివంచన లేకుండా కృషి చేసేవారు. దక్షిణ భారతదేశంలో 43 శాఖలు కలిగి 2,850మంది ఉద్యోగులు తమ సంస్థలో పనిచేసే స్థాయిలో ఈ 40సంవత్సరాలలో సంస్థ ఎదిగింది. వెంకటేశ్వరరావు, గంగాదేవిల కృషితో పాటు వారి కుమారుల కష్టం ఈ విజయం వెనుక ఉంది. తమ ఇంటి దీపాన్ని కోల్పోయి దుఃఖ సాగరంలో ఉన్న వేములూరి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

### కొండ్రెడ్డి దశరథరామిరెడ్డి



విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తండ్రి కొండ్రెడ్డి దశరథరామిరెడ్డి ఈ నెల 5వ తేదీన అనారోగ్యంతో స్వర్గస్థులైనారు. ఆయన వయసు 85 సంవత్సరాలు. అల్లూరు మండలం నార్త్‌మోపూరు ఆయన స్వగ్రామం. ఆది నుండి రైతు కుటుంబం. ఆయనకు ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె. పెద్దకొడుకు రంగారెడ్డి విజయడెయిరీ ఛైర్మెన్‌గా, మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి కుడి భుజంగా అందరికీ సుపరిచితమే! కొన్నాళ్ళ క్రితం భార్యను, ఈ ఏడాదిలోనే తల్లిని, ఇప్పుడు తండ్రిని కోల్పోయి దుఃఖంలో వున్న రంగారెడ్డికి సానుభూతి తెలుపుతూ, దశరథరామిరెడ్డి మృతికి సంతాపం తెలుపుతోంది 'లాయర్'.

### వంకి శంకరమ్మ



ఆదిశంకర విద్యాసంస్థల ఛైర్మెన్, రాజకీయ వ్యాపార రంగాలలో ప్రముఖుడు వంకి పెంచలయ్య మాతృమూర్తి వంకి శంకరమ్మ ఈ నెల 1వ తేదీన తుదిశ్వాస విడిచారు. ఆమెకు ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు. కొడుకు పెంచలయ్య జిల్లా ప్రజలకు సుపరిచితుడే! వంకి పెంచలయ్యకు తన తల్లిదండ్రులంటే ప్రాణం. తన తండ్రి ఆదిశేషయ్య, తల్లి శంకరమ్మ పేరు కలిసొచ్చేలాగానే ఆయన తన విద్యాసంస్థలకు 'ఆదిశంకర' అనే పేరు పెట్టుకున్నాడు. శంకరమ్మ మృతికి సంతాపం తెలుపుతూ తల్లిని కోల్పోయిన బాధలో వున్న పెంచలయ్య కుటుంబానికి సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# నారా వారికి.. నందమూరి లోకువ!

(మొదటి పేజీ తరువాయి)

తొక్కేస్తున్నాడు. ముఖ్యంగా చంద్రబాబు రాజకీయ స్వార్ధానికి బలైనవారిలో నందమూరి హరికృష్ణ కుటుంబం ముందుంటుంది. 1995లో జరిగిన మామ (ఎన్టీఆర్), అల్లుడు(చంద్రబాబు)ల సమరంలో తండ్రిని కాదని హరికృష్ణ బావకు అండగా నిలిచాడు. మొదట హరికృష్ణను అక్కున చేర్చుకున్నట్లే చేర్చుకున్న చంద్రబాబు, ఆ తర్వాత గాలికొదిలేసాడు. హరికృష్ణ తర్వాత చంద్రబాబు మీద వ్యతిరేకతతో అన్న తెలుగుదేశం పార్టీని స్థాపించడం, కొన్నాళ్ళ తర్వాత దానిని మూసేసి తెలుగుదేశంలో చేరడం వంటివన్నీ జరిగిపోయాయి. ఒక్క హరికృష్ణతో సరిపెట్టాడా? తెలుగు సినిమాలలో దూసుకుపోతున్న జూనియర్ ఎన్టీఆర్‌పై ఒకప్పుడు సవతిప్రేమను చూపించారు. అతనిని తొక్కేయాలనుకున్నారు. అతనికి పోటీగా తమ కుటుంబంలో నుండే తారకరత్న అనే హీరోను దింపారు. అవేవీ ఫలించలేదు. 2009 ఎన్నికల్లో మళ్ళీ జూనియర్ ఎన్టీఆర్ ఇమేజ్‌ను వాడుకోవాలని చెప్పి ఆయనను ప్రచారంలో తిప్పారు. ఆ ఎన్నికలలో ఓడిపోయాక మళ్ళీ దూరం పెట్టారు. 2014 ఎన్నికలప్పుడైతే అసలు జూనియర్ ఎన్టీఆర్ ఊసే ఎత్తలేదు. అప్పుడంతా పవన్‌కళ్యాణ్ భజనలో వుండిపోయాడు. ఇప్పుడు తెలంగాణ ఎన్నికల్లో అదే హరికృష్ణ కుటుంబాన్ని వాడుకుంటున్నాడు. హరికృష్ణ కుమార్తె చుండ్రు సుహాసిని కూకట్‌పల్లిలో తెలుగుదేశం అభ్యర్థిగా నిలబెట్టాడు. చుండ్రు స్థానంలో 'నందమూరి'ని చేర్చారు. పేరును వాడుకోవడం ఇక్కడ కూడా జరుగుతోంది.

చంద్రబాబు కొడుకు లోకేష్ ఏమో దొడ్డిదారిన ఎమ్మెల్సీ అయ్యి, మంత్రి కావొచ్చు. మరి హరికృష్ణ కూతురుకు ఆ అర్హత లేదా? హరికృష్ణ కుటుంబానికి న్యాయం చేయాలనుకుంటే చుండ్రు సుహాసినిని ఎమ్మెల్సీగా పంపొచ్చు. లేదంటే గతంలో ఆమె తండ్రి వున్న రాజ్యసభ స్థానానికి ఆమెను ఎంపిక చేయవచ్చు... వాళ్ళను ఎన్నికల్లో నిలబెట్టే బదులు తన కోడలు నారా బ్రాహ్మణినే అక్కడ నిలబెట్టి ఉండొచ్చుగా! కాని, చంద్రబాబు అలా చేయడు. అక్కడ బ్రాహ్మణి ఓడిపోతే చంద్రబాబు పరువు పోతుంది. చుండ్రు సుహాసిని అలియాస్ నందమూరి సుహాసిని ఓడిపోతే చంద్రబాబుకు వచ్చిన ఇబ్బందేమీ లేదు. ఈ లెక్కతోనే 'నందమూరి' ఇంటి పేరును తెలంగాణ ఎన్నికల్లో మరోసారి వాడుకుంటున్నాడు. నందమూరి వారసులు చంద్రబాబు వాడుకోవడం కోసమే వున్నట్లున్నారు.

# గెలిస్తే బాబు ఘనత...

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరించడంగా పచ్చమీడియా ప్రచారం చేస్తుంది. కాంగ్రెస్ మీదున్న వ్యతిరేకతతోనే తెలుగుదేశానికి రెండు సీట్లు కూడా రాలేదనే ప్రచారం జరుగుతుంది. తెలుగుదేశం విడిగా అన్ని స్థానాలలో పోటీ చేసుంటే 30స్థానాల దాకా గెలుచుకుని ప్రభుత్వ ఏర్పాటులో చక్రం తిప్పేదని కూడా అంటారు. రేపు మహాకూటమి గెలిచినా, ఓడినా రెండు స్క్రిప్ట్‌లు కూడా చంద్రబాబు వద్ద సిద్ధంగా వున్నాయి.

ఎటుపోయి గెలిచినా, ఓడినా నష్టం జరిగేది కాంగ్రెస్ నాయకులకే! కూటమి గెలిచిందంటే చంద్రబాబు పవర్ రాజకీయాలు నడిపి తన శిష్యుడు రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలని చూస్తాడు. సిఎం రేసులో వున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానారెడ్డి, డి.కె.అరుణ, పొన్నాల లక్ష్మయ్య వంటి వాళ్ళంతా నోర్లు తెరచి చూడాల్సిందే!

# గబ్బుపడుతున్న గబ్బర్‌సింగ్

(మొదటి పేజీ తరువాయి)

అమలుకు నాది గ్యారంటీ అని... కావాలంటే బాండ్ పేపర్ రాసిస్తానన్నాడు. కాని, ఈ నాలుగున్నరేళ్ళుగా ఆయన ఏ ఒక్క హామీ అమలుకు కూడా బాధ్యత వహించిన దాఖలాలు లేవు. హామీలు అమలు చేయకపోతే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తానన్న ఆయన గొంతు గావుకేకలు వేయడానికి తప్పితే చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి తెరుచుకోలేదు. బంగారు పంటలు పండే భూములను సింగపూర్ రాజధాని పేరుతో లాక్కుంటున్నప్పుడు, అధికారులను అధికారపార్టీ నాయకులు ఇసుకలో ఈడ్చి కొట్టినప్పుడు, కాల్‌మనీ సంఘటనలు బయటపడినప్పుడు, ఎయిర్ పోర్టుల పేరుతో భూములు కబ్జా చేసినప్పుడు, ప్రత్యేకహోదా అక్కర్లేదని ప్యాకేజీకి ఒప్పుకున్నప్పుడు, వివిధ ఆర్భాటాలకు వేలకోట్లు దుర్వినియోగం చేస్తున్నప్పుడు ప్రశ్నిస్తానన్న ఆ గొంతు పెగలలేదు. మరి ఈ గొంతు ఎక్కువుగా ఎవరిమీద లేస్తుందంటే ప్రతిపక్ష నేత జగన్ మీద. భారత దేశ రాజకీయ చరిత్రలోనే అవినీతి, అక్రమాలతో సాగుతున్న ప్రభుత్వాన్ని వదిలేసి, ఏ ఒక్కరోజు కూడా పరిపాలన చేయని ప్రతిపక్ష నేతను విమర్శిస్తున్న నాయకుడెవరైనా వున్నారంటే అది ఒక్క పవన్ కళ్యాణే!

ఇటీవల వరకు వైసిపిలో కూడా కొంతమంది నాయకులు పవన్‌ను చంద్రబాబుతో పోట్లాడుతున్నాడనే నమ్మేవాళ్ళు. ఇప్పుడు వైసిపి నాయకులే కాదు, జనం కూడా పవన్‌ను నమ్మడం లేదు. అతను ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చడానికి చంద్రబాబు ప్రయోగించిన అస్త్రం అని అందరికీ ఇప్పుడిప్పుడే అర్ధమవుతోంది. అతను పక్కా చంద్రబాబు తొత్తు అని తెలిసాక జగన్ కూడా పవన్ విమర్శలకు ఘాటుగా బదులిస్తున్నాడు. పవన్ చంద్రబాబు మనిషని, అతని చేతిలో కీలుబొమ్మని అందరికీ అర్ధమవుతోంది. ఇక అర్ధం చేసుకోవాల్సింది పవన్ గారి పిచ్చి అభిమానులే!

## కల్లంపై...
# కన్నెర్రజేసిన సోమిరెడ్డి

తెలుగుదేశం ప్రభుత్వం మీద ఎవరు విమర్శలు, ఆరోపణలు చేసినా కౌంటర్ ఇవ్వడానికి ముందుండే రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి అలాంటి అవకాశమే మళ్ళీ చిక్కింది. రాష్ట్ర ప్రభుత్వంలో 3లక్షల కోట్ల అవినీతి జరిగిందని రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ అజయ్ కల్లం ఆరోపించడం జరిగింది. ఈ ఆరోపణలపై సోమిరెడ్డి చిందులు తొక్కాడు. 3వ తేదీ ముత్తుకూరులో విలేకరుల సమావేశం పెట్టి కల్లంను కసితీరా తిట్టాడు. చీఫ్ సెక్రటరీగా పనిచేసి రిటైర్డ్ అయిన ప్రతివాడికి చంద్రబాబు లోకువవుతున్నాడు. ఇన్ని లక్షల కోట్ల అవినీతి జరుగుతుంటే చీఫ్ సెక్రటరీగా వుండి నిద్రపోతున్నావా? తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక ఆర్థిక, రెవెన్యూ శాఖలకు కార్యదర్శిగా పని చేశావు. ఎక్సైజ్ శాఖ స్పెషల్ సిఎస్‌గా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు వెలగబెట్టావు. మరి



మీరు నడుపుతున్న ఫైళ్లలో అవినీతి వుందని తెలిస్తే అప్పుడే ఎందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోలేదు. కనీసం కేంద్రానికి ఎందుకు తెలియపరచలేదు. పదవుల్లో వుండగా చంద్రబాబును పొగిడిన మీరు, పదవుల నుండి రిటైర్డ్ కాగానే జగన్‌కు అమ్ముడుపోయి చంద్రబాబుపై బురదచల్లుతున్నారంటూ అజయ్ కల్లంపై సోమిరెడ్డి మండిపడ్డాడు.

## • బాబుపై కాకాణి ఫైర్
# నిప్పు... సిబిఐ అంటే భయమెందుకో చెప్పు




వై.యస్.జగన్మోహన్‌రెడ్డిపై సిబిఐ విచారణ జరిగినప్పుడు మాత్రం చట్టం తనపని తాను చేసుకుపోతుందని సూక్తి ముక్తావళి ప్రబోధించిన చంద్రబాబుకు ఇప్పుడు అదే సిబిఐను చూస్తే ఎందుకు గుండె దడ వస్తుందని వైసిపి జిల్లా అధ్యక్షుడు సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రశ్నించాడు. 4వ తేదీ నెల్లూరులోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన చంద్రబాబుపై నిప్పులు చెరిగాడు. నేను నిప్పును, నిజాయితీ గల పప్పును అని చంద్రబాబు చెప్పుకుంటుంటాడు. నిప్పువైతే ఈ రాష్ట్రంలో సిబిఐని నిషేధించాల్సిన అవసరమేముంది. సిబిఐ విచారణ జరిగితే మీ బొక్కలు బయటపడతాయని భయం. మీ అవినీతి కుంభకోణాలు ఎక్కడ బయట పడతాయోనని సిబిఐ విచారణలను అడ్డుకుంటున్నారు. నీ ప్రభుత్వంలో పని చేసిన మాజీ సిఎస్‌లేమో ప్రభుత్వంలో 3లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపణలు చేస్తే, మీరు సమాధానాలు చెప్పలేక మీ తాబేదారైన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేత వాళ్లను తిట్టిస్తున్నారు. తన ప్రభుత్వంపై ఆరోపణలు వస్తే స్వయంగా సిబిఐ విచారణ వేయించుకున్న మొనగాడు వై.యస్. రాజశేఖరరెడ్డి. ఆయన కాలంలో పనిచేసిన ఏ సిఎస్ గాని, ఇతర అధికారులు గాని ఆయనపై ఆరోపణలు చేయలేదు. కాని మీ మీదనే ఇంతమంది రిటైర్డ్ అధికారులు అవినీతి ఆరోపణలు చేస్తున్నారంటే మీ పాలనా నిర్వాకం ఎంత అధ్వాన్నంగా వుందో అర్థమవుతుందని కాకాణి దుయ్యబట్టాడు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పిచ్చివాగుడు వాగుతున్నాడు. ఓ పక్క ఐవైఆర్ కృష్ణారావు, అజయ్ కల్లం లాంటి రిటైర్డ్ సి.ఎస్.లు ప్రభుత్వ అవినీతిపై ఆరోపణలు చేస్తే, వాటి గురించి మాట్లాడని పవన్ కళ్యాణ్, తాను చంద్రబాబు చెంచానేనని పరోక్షంగా చాటుకుంటున్నాడని కాకాణి ధ్వజమెత్తాడు.

## మాగుంట సుబ్బరామన్న సేవలు..
# సమాజానికి స్ఫూర్తిదాయకం
### ---------------------- వర్ధంతి సభలో వక్తల ప్రశంస



మాజీ ఎంపి, దివంగత నాయకుడు మాగుంట సుబ్బరామిరెడ్డి ప్రజలకు చేసిన సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని వక్తలు ప్రశంసించారు. ఈనెల 1న నెల్లూరు రంగనాయకులపేటలోని రాఘవ కల్యాణమండపంలో జరిగిన మాగుంట సుబ్బరామిరెడ్డి వర్ధంతి సభలో పలువురు నాయకులు పాల్గొని మాగుంట సుబ్బరామిరెడ్డి నిస్వార్థ సేవలను స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సివి శేషారెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మన్, చెంచలబాబుయాదవ్, విజయాడెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నాయకులు రఘురామ్ ముదిరాజ్ తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

# సోషల్ వెల్‌ఫేర్ డీడీ దాసరి సస్పెండ్

నెల్లూరు జిల్లా సోషల్ వెల్ ఫేర్ డిపార్ట్‌మెంట్ డీడీగా పనిచేసి తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ అయిన దాసరి మధుసూదనరావును రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సస్పెండ్ చేస్తూ జీవోను జారీచేశారు. మధుసూదనరావు ఆదాయానికి మించి అక్రమ ఆస్తులు కలిగి ఉన్నారనే కారణంతో గతనెల 11న ఏసీబీ అధికారులు దాడులు చేసి అరెస్టు చేశారు ఈ క్రమంలో అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించడంతో రాష్ట్ర ముఖ్యకార్యదర్శి మధుసూదనరావును సస్పెండ్ చేస్తూ జీవో జారీ చేశారు.

# కామాక్షమ్మ సన్నిధిలో ప్రాకారమండపాలు
## • శంకుస్థాపన చేసిన దాతలు



జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానంలో ప్రాకార మండపాల నిర్మాణానికి 3వ తేదీ శంకుస్థాపన చేశారు. జొన్నవాడ అమ్మవారి దేవస్థానంలో గర్భగుడికి ఉత్తరం, దక్షిణం వైపుల గతంలో చిన్న మండపాలుండేవి. కాలక్రమంలో దేవస్థానానికి భక్తుల రద్దీ పెరుగుతుంది. ఉత్సవాల సమయంలో ఈ ప్రాంతం ఇరుకుగా వుంటుంది. దీంతో ఆ పాత మండపాలను తొలగించారు. ఇరువైపులా స్థలాన్ని చదును చేశారు. రెండు వైపులా ప్రాకార మండపాలను విస్తరించనున్నారు. ఈ రెండు వైపులా ప్రాకార మండపాల నిర్మాణంకు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అలాగే హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త కొలను రాజారెడ్డి ముందుకొచ్చారు. 3వ తేదీన ప్రాకార మండపాల నిర్మాణానికి దాతలు కొలను రాజారెడ్డి, పూజిత దంపతులు శంకుస్థాపన చేశారు. ఆలయ కమిటి ఛైర్మెన్ పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యంనాయుడు, కమిటి సభ్యులు సారధ్యంలో త్వరలో జరిగే మహాకుంభాభిషేకం నాటికి ఈ మండపాల నిర్మాణం పూర్తి చేయనున్నారు.


శ్రద్ధాంజలి



శ్రీమతి వేములూరి గంగాదేవి గారు

జననం: 02.04.1945 మరణం: 30.11.2018

అమ్మను కోల్పోయి అశ్రునయనాలతో ఉన్న
ఆప్తమిత్రుని కుటుంబానికి
మా ప్రగాఢ సానుభూతి.
ఆమె ఆత్మశాంతికై ఆ భగవంతుని ప్రార్థిస్తూ...

నెల్లూరు.

## • స్వగ్రామాలకు

# వరసపెడుతున్న వలసవాసులు

SRI CITY
ప్రగతిపథంలో
10 ఏళ్ళు

### • పల్లెవాసుల్లో ఆశలు చిగురింపజేస్తున్న 'శ్రీసిటీ'
### • హాలీవుడ్ కోసం సూట్లు కుడుతున్న మత్స్యకార మహిళలు

**పట్టణాలు, నగరాల్లో శ్రీసిటీ అంటే.. అదో మహా పారిశ్రామిక నగరం. విదేశాల్లో శ్రీసిటీ అంటే.. గ్రేట్‌సిటీ. పల్లె ప్రాంతాల్లో శ్రీసిటీ అంటే ఉద్యోగాలిచ్చే ఊరు. ఇలా ఏ పేరున పిలిచినా శ్రీసిటీ రూటే వేరు.. దాని ప్రత్యేకతే వేరు. చిన్నస్థాయి ఉద్యోగాలకు ఇక్కడ కొదవే లేదు. ప్రతిభావంతులకు పెద్దపెద్ద ఉద్యోగాలకు లోటే లేదు. వేలాదిమందికి ఉద్యోగం, ఉపాధి కల్పించడమంటే మాటలతో పనికాదు. అందుకుతగ్గ సత్తా ఉండాలి. సామర్థ్యం ఉండాలి. నిరంతర కృషి, దీక్షాదక్షతలు ఉండాలి. ఇవన్నీ పుష్కలంగా ఉన్న శ్రీసిటి ఛైర్మెన్ శ్రీనిరాజు, అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజం రవీంద్ర సన్నారెడ్డిల సారధ్యంలో శ్రీసిటీ ఇప్పుడు ప్రపంచప్రఖ్యాతి చెందుతోంది. ఎంతోమంది జీవితాలకు.. జీవనాలకు కాంతిరేఖలా శ్రీసిటి వెలుగులీనుతోంది.**



శ్రీని రాజు, ఛైర్మెన్, శ్రీసిటి

*శ్రీసిటీకి ఇప్పుడు పదేళ్ళు. ఈ దశాబ్దకాలంలోనే నూరేళ్ళ ఘనతను సాధించింది... శ్రీసిటీ. పచ్చదనం పరిశుభ్రతలతో సుందర నందనవనంగా.. ఒక అద్భుతమైన పారిశ్రామిక నగరంగా విస్తరిల్లి, వేలాదిమందికి ఉద్యోగాలు ఉపాధి కల్పిస్తూ జాతీయస్థాయిలోనే కాక ప్రపంచవ్యాప్తంగా గ్రేట్‌సిటీగా.. శ్రీసిటీ విఖ్యాతమవుతోంది. ఎవరూ ఊహించని విధంగా దాదాపు 47వేల కోట్ల పెట్టుబడులతో, 27 దేశాలకు చెందిన 180 పరిశ్రమలతో కళకళలాడుతూ, 40 వేల మందికిపైగా ఉద్యోగులతో విలసిల్లుతూ.. పారిశ్రామిక రంగంలో సింహపురిసీమ కీర్తిపతాకాన్ని ప్రపంచం నలు దిశలా రెపరెపలాడిస్తోంది. ఇది సింహపురిసీమకే కాదు.. మనదేశానికే గర్వకారణమైన విషయమని వేరే చెప్ప నక్కరలేదు.*



రవీంద్ర సన్నారెడ్డి, ఫౌండర్ ఎం.డి, శ్రీసిటి

**ప**దేళ్ళ క్రితం ఒక ప్రత్యేక ఆర్థిక మండలిగా శ్రీసిటీ తన ప్రస్థానం మొదలు పెట్టి ఆనాటి నుంచి అకుంఠిత కృషితో, పట్టుదలతో.. ప్రతిభాపాటవాలతో ముందుకు దూసుకుపోతూ నేడు ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామిక నగరంగా ప్రసిద్ధి చెందింది. 2008 ఆగస్టు 8వ తేదిన నెల్లూరుజిల్లాలోని తడ, చిత్తూరుజిల్లాలోని సత్యవేడు, వరదయ్యపాళెంలలో సుమారు 7500 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన శ్రీసిటీ ఈ పదేళ్ళకాలంలో ప్రగతిపథంలో పరుగులు తీస్తూ..ఇప్పుడు ఏకీకృత వ్యాపార నగరం (ఇంటిగ్రేటెడ్ బిజినెస్ సిటీ)గా ప్రఖ్యాతం కావడం ఎంతో సంతోషించ దగ్గ విషయం.

'శ్రీసిటీ'... ఈపేరు వినగానే నిరుద్యోగ యువతకు ఒళ్ళు పులకరిస్తుంది. పల్లెప్రజల్లో ఆశలు మోసులెత్తుతాయి. విద్యావంతులకే కాదు, కొద్దోగొప్పో చదువుకున్నవారికి, చదువుకోనివారికి, మత్స్యకార మహిళలకు కూడా అశా దీపంలా ఉండడం శ్రీసిటీ గొప్పదనం. ఎందరో మత్స్యకార మహిళలు సైతం వృత్తిపరమైన శిక్షణ పొంది ఇప్పుడు శ్రీసిటీలో హాలీవుడ్ కోసం సూట్లను తయారుచేస్తున్నారంటే..చూడండి ఎంత విశేషమో!.. అంతేకాదు, గతంలో బతుకు తెరువు వెదుక్కుంటూ ఇతరప్రాంతాలకు వలసలు పోయినవారంతా ఇప్పుడు శ్రీసిటీ ఉంది కదా అనే భరోసాతో.. తమ స్వగ్రామాలకు వరసపెడుతున్నారంటే వారి జీవనోపాధికి మార్గం దొరికినట్లే కదా!....

### ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఎన్నో కంపెనీలకు నెలవు

ఒకప్పట్లో ఈ ప్రాంతమంతా ఎంతో వెనుకబాటుతనంతో ఉండేది. శ్రీసిటీ ఆవిర్భావంతో ఈ ప్రాంతమంతా ఇప్పుడు సర్వతోముఖాభివృద్ధి చెందుతోంది. దేశ విదేశీ సంస్థల పెట్టుబడులకు ఒక ముఖ్యకేంద్రంగా ఉంటోంది శ్రీసిటీ. పెప్సికో, అల్స్టం, కొబెల్కో, కాల్గేట్ పామోలివ్, కెల్లాగ్స్, డేనీల్ ఇండియా, నిట్టాన్ వాల్వ్, లావాజ్జా, పయోలాక్స్, విఆర్వీ, వెస్ట్ ఫార్మా, అస్ట్రోటెక్, రాక్వర్త్, ఎవర్టన్ టీ వంటి పలు ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కంపెనీలు ఇక్కడున్నాయి. జపాన్‌కు చెందిన ప్రపంచప్రఖ్యాత వాహన ఉత్పత్తిసంస్త 'ఇసుజు' తన అనుబంధ కంపెనీ 'ఇసుజు మోటార్స్ ఇండియా ప్రై.లి' కర్మాగారాన్ని సుమారు 3వేల కోట్ల రూపాయల వ్యయంతో శ్రీసిటీలో నిర్మించడం ఎంతో విశేషం. అదేవిధంగా మోండెలెజ్ అంతర్జాతీయసంస్థ వెయ్యికోట్ల పెట్టుబడితో తన అనుబంధ కంపెనీ అయిన 'క్యాడ్బరీ ఇండియా'ను ఇక్కడ నెలకొల్పింది. ఇది ఆసియా–పసిఫిక్ ప్రాంతంలోనే అతిపెద్ద చాక్లెట్ల ఉత్పత్తి కర్మాగారం. ఇక్కడ 60 రకాలకు పైగానే చాక్లెట్లు తయారవుతున్నాయి. చిన్నారుల ఇష్టపడే కార్న్‌ఫ్లాగ్స్, చాకోస్ ఉత్పత్తుల ప్రధానసంస్థ కెలాగ్స్ కూడా ఇక్కడే ఉంది. పెప్సీ కూల్‌డ్రింక్ కూడా ఇక్కడే తయారవుతోంది.

### నెలకు 10 లక్షల ఫోన్లు తయారవుతున్నాయి :

తైవాన్‌కు చెందిన అతిపెద్ద స్మార్ట్‌ఫోన్ల తయారీ ప్లాంట్ 'రైజింగ్‌స్టార్ మొబైల్స్ ఇండియా లిమిటెడ్ (ఫాక్స్‌కాన్) కంపెనీని శ్రీసిటీలో నెలకొల్పడంతో ఇక్కడ సోని, మైక్రోసాఫ్ట్, జియోని, షియోమి, వన్ ప్లస్ తదితర రకాల ఫోన్లు ఇక్కడ నెలకు 10లక్షల దాకా తయారవుతున్నాయంటే అతిశయోక్తి కాదు. ఈ పరిశ్రమలో సుమారు 15వేల మంది పనిచేస్తుంటే, ఇందులో 90శాతం మంది మహిళలే కావడం విశేషం. ఇంజనీరింగ్ పరిశ్రమలు మరో 40 దాకా ఉన్నాయి. ఆరోగ్య పరిరక్షణకు ఉపకరించే వస్తువుల తయారీకి ప్రపంచ విఖ్యాతిగాంచిన జపాన్ కంపెనీ యూనిచాం శ్రీసిటీలో ఉత్పత్తి ప్రారంభించింది. జపాన్ దేశానికి సంబంధించి ఇక్కడ 20 భారీపరిశ్రమలున్నాయి. ఎక్కువభాగం ఆటోమొబైల్ విడిభాగాలను తయారుచేసే ఈ పరిశ్రమల రాకతో శ్రీసిటీ ఒక ఆటోమొబైల్ హబ్‌గా వృద్ధి చెందుతోంది కూడా. అంతేకాదు, ఇక్కడ అతి పెద్ద ఎలక్ట్రానిక్ వస్తువుల ఉత్పత్తి పరిశ్రమల సముదాయాన్ని శ్రీసిటీ సహకారంతో నిర్మించడానికి భారత ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల సంఘం ఒక ప్రణాళికలను కూడా రూపొందించింది. ఇలా అనేక దేశవిదేశీ పరిశ్రమలకు శ్రీసిటీ నెలవుగా ఉంది. ఇంకా అనేక పరిశ్రమలు నిర్మాణాల్లో ఉన్నాయి.



శ్రీసిటి విహంగ వీక్షణం

### శ్రీసిటీ పరిధిలోని గ్రామాల ప్రజలకు ఇంటికో ఉద్యోగం

మరో ముఖ్యమైన విషయమేమిటంటే, శ్రీసిటీలో ఉపాధి పొందుతున్నవారిలో మన రాష్ట్రానికి చెందినవారు 88 శాతం మంది ఉంటే, ఇతర రాష్ట్రాలవారు 12 శాతం ఉన్నారు. శ్రీసిటీ పరిధిలోని 14 గ్రామాల్లో మొత్తం జనాభా 1893 కుటుంబాలుంటే వారిలో ఇంటికో ఉద్యోగం, ఉపాధి ఉన్నవారు 94 శాతానికి పైగానే ఉన్నారంటే స్థానికులకు శ్రీసిటీ ఎంతగా జీవనోపాధి కలిగిస్తోందో అర్ధమవుతుంది. ఆర్థికంగా చితికిపోయి వ్యవసాయకూలీలుగా దయనీయమైన జీవితాలను గడుపుతున్న ఈ ప్రాంతాల ప్రజలకు శ్రీసిటీ గొప్ప వరం. ఇప్పుడు ఆయా కుటుంబాల్లో పురుషులతో పాటు మహిళలకు కూడా ఇక్కడ ఉపాధి లభించడంతో వారి ఆనందం అంతా ఇంతా కాదు. కలుపు తీసిన చేతులు నేడు కంప్యూటర్లతో పని చేస్తున్నాయి. అరక పట్టిన రైతు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో యంత్రాల ద్వారా సేద్యం చేయగలుగుతున్నాడు. పూరిగుడిశెల్లో జీవించిన బడుగు ప్రజలు ఇప్పుడు పక్కా ఇళ్ళల్లో నివసించగలుగుతున్నారు. విద్యార్హతలు లేని ఎంతో మంది స్త్రీలకు శ్రీసిటీ ఆధ్వర్యంలో తగు శిక్షణ ఇచ్చి ఆయా వృత్తులతో వారికి మంచి జీవనోపాధి కలిగిస్తుండడంతో ఆయా గ్రామాల్లోని ప్రజల జీవనశైలే మారిపోయింది. ఇదంతా శ్రీసిటీ పుణ్యమే. ఇంత గొప్ప పారిశ్రామిక కేంద్రంగా శ్రీసిటీ వెలసి వర్ధిల్లుతుండడం జిల్లా చరిత్రలోనే అపూర్వమైన విషయం.

### ఎన్నెన్నో ప్రతిష్టాత్మక అవార్డులు–పురస్కారాలు

సాధారణంగా పరిశ్రమలంటేనే కాలుష్యమనే నానుడికి భిన్నంగా శ్రీసిటీలో అన్నీ కాలుష్యరహిత పరిశ్రమలే ఉండడం ఇక్కడి ప్రత్యేకత. పచ్చదనాన్ని పెంపొందించేందుకు 50 ఎకరాల్లో మొక్కల పెంపకం సాగుతోంది. కోటి మొక్కలను పెంచాలనే లక్ష్యంతో విరివిగా మొక్కలు నాటుతున్నారు. అందుకే, శ్రీసిటీ గ్రీన్‌సిటీగా ప్రపంచదృష్టిని ఆకట్టుకుని ఇండియన్ గ్రీన్‌బిల్డింగ్ కౌన్సిల్ (ఐజిబిసి)కి చెందిన ఎంతో ప్రతిష్టాత్మకమైన గ్రీన్‌సిటీ గోల్డ్ రేటింగ్ అవార్డుతో పాటు పలు విశిష్టమైన పురస్కారాలు కూడా శ్రీసిటీకి లభించాయి. అయినా, గొప్పగొప్ప పరిశ్రమలెన్నిటినో ఇక్కడ నెలకొల్పుతూ, వేలాదిమంది జీవితాలకు వెలుగుదారులు చూపుతున్న శ్రీసిటీకి... అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపుతో రాణిస్తూ మణిమకుటంగా ప్రకాశిస్తున్న ఈ గ్రేట్‌సిటీకి ఎన్ని గొప్ప అవార్డులు ఇచ్చినా తక్కువేననడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

### జన్మభూమి సేవలో...

**జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ.. అన్నారు పెద్దలు. కన్నతల్లికి, జన్మభూమికీ సేవ చేయాలనే తపనతో ఈ జిల్లాలో పుట్టిన రవీంద్ర సన్నారెడ్డికి సంకల్పం కలగడం.. ఆ ఆలోచనను కళాశాలలో తన మిత్రుడైన శ్రీని రాజుకు తెలియజేయడం.. శ్రీనిరాజు ఈ ప్రాంతం వారు కాకపోయినప్పటికీ, సొంతజిల్లాపై ఎనలేని అభిమానంతో.. తాను పుట్టిన గడ్డపై పుట్టిన ప్రజలకు తనవంతు సేవలందించాలన్న మమకారంతో ఉన్న రవీంద్ర సన్నారెడ్డికి తన హార్థిక ఆర్థిక సహకారం అందించి ప్రోత్సహించడం.. మొత్తంగా ఈ ఆలోచనల్లోంచే శ్రీసిటీ రూపకల్పనకు శ్రీకారం చుట్టడం జరిగింది. సన్నారెడ్డి సంకల్పం.. శ్రీనిరాజు ప్రోత్సాహం కలసి వెరసి శ్రీసిటీ ఇప్పుడు దేశంలో అగ్రగామి పారిశ్రామిక నగరంగా రూపుదిద్దుకుంది. అంచలంచలుగా ఎదుగుతూ.. కేవలం పదేళ్ళలోనే శ్రీసిటీ ప్రపంచ ప్రఖ్యాతి చెందిన పారిశ్రామిక నగరంగా రూపుదాల్చడం.. జిల్లాలోని వేలాదిమంది బడుగుజీవులకు, నిరుద్యోగ యువతకు జీవనోపాధి కల్పిస్తూ వారి జీవితాలకు బంగారుబాట వేయడం చూస్తే..వీరి కృషికి.. ప్రతిభాపాటవాలకు హ్యాట్సాఫ్ చెప్పక తప్పదు. శ్రీసిటీ పదేళ్ల నాటి పురోగతి మన జిల్లాకే కాదు..దేశానికే గర్వకారణమవుతుంది.**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com